ప్రభాత
# సూర్య
www.suryaa.news
తెలుగు జాతీయ దిన పత్రిక
వేల రూ.5/ - పేజీలు : 8 శుక్రవారం 13 జూన్ 2025 సంపుటి: 01, సంచిక : 37
PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD

### విజయ్ మాల్యా లెక్క సంగతేంటీ

**హైదరాబాద్ :** భారతదేశంలో కేసులు ఎదుర్కొంటున్న సమయంలో దేశం విడిచి పారిపోయిన వ్యక్తులలో విజయ్ మాల్యా ఒకరు. ఆయన ఒక తెలివైన వ్యాపారవేత్త, క్రీడాభిమాని. రాజకీయ అనుభవజ్ఞుడు. కింగ్ ఫిషర్ ఎయిర్‌లైన్స్ మూసివేత తర్వాత మాల్యా దురదృష్టం ప్రారంభమైంది. ఆర్థిక అవకతవకలు, రుణాలు తిరిగి చెల్లించకపోవడం వంటి కొన్ని తీవ్రమైన ఆరోపణలను ఆయన ఎదుర్కొన్నారు. 2016లో దేశం విడిచి వెళ్లిన వ్యక్తి తిరిగి రాలేదు.విజయ్ మాల్యా చెప్పిన దాని ప్రకారం, బ్యాంకుల నుండి అతను పొందిన రుణాలు రూ.4,000 కోట్ల కంటే కొంచెం ఎక్కువగా ఉండవచ్చు. వడ్డీ అంతా కలిపితే రూ.6,203 కోట్లు అవుతుంది. అయితే ప్రభుత్వం అతని ఆస్తులను స్వాధీనం చేసుకుని రూ.14,131.60 కోట్లు రికవరీ చేసినట్లు తెలుస్తోంది.

విలేకరులు కావలెను
సీనియర్ జర్నలిస్టుల సారధ్యంలో వస్తోన్న జాతీయ తెలుగు దినపత్రిక 'సూర్య' కి నిబద్ధత కలిగిన యువ, నవతరం కలం యోధులు కావాలి.
96667 32777
ప్రభాత సూర్య
www.suryaa.news




# మహా విషాదం

## 265 మంది దుర్మరణం

మృత్యుంజయుడు


ప్రమాదం నుంచి బయటపడి వస్తున్న రమేశ్ విశ్వాస్‌కుమార్

చివరి సెల్ఫీ


విమానంలో రాజస్తాన్‌కు చెందిన డాక్టర్ కోమి వ్యాస్ కుటుంబం

- ఇలా టేకాఫ్ అయి..., కూలిపోతూ..., మంటల్లో...
- ఎయిరిండియా విమానానికి ఘోర ప్రమాదం
- మెడికల్ కాలేజీపై కుప్పకూలి పేలిపోయిన డ్రీమ్‌లైనర్
- 265 మంది దుర్మరణం.. అహ్మదాబాద్‌లో ఘోరం
- విమానంలోని 242 మందిలో బతికింది ఒక్కరే
- మృతుల్లో గుజరాత్ మాజీ సీఎం రూపానీ సహా 180 మంది భారతీయులే, 53 మంది బ్రిటన్‌వాసులు.. ఏడుగురిది పోర్చుగల్, ఒకరిది కెనడా

3

- టేకాఫైన కొద్ది క్షణాలకే కాలేజీ క్యాంటీన్, హాస్టల్‌పై పడ్డ విమానం
- వాటితో పాటు సమీప భవనాలు ధ్వంసం
- హాస్టల్‌లో ఉన్నవారిలో 24 మంది మృతి
- వారిలో ఒక వైద్యుడు, నలుగురు మెడికోలు
- 60 మందికి గాయాలు, ఐదుగురి పరిస్థితి విషమం
- శిథిలాల కింద ఇంకా పలువురు ఉండే అవకాశం
- రాష్ట్రపతి, ప్రధాని తదితర ప్రముఖుల దిగ్భ్రాంతి
- నేడు ప్రధాని మోదీ సందర్శన



## ఆర్థిక ఆరోగ్య భద్రత
# సీయేల చేతుల్లోనే



- అభివృద్ధి చెందిన దేశాలతో తెలంగాణ పోటీ
- మీ నిజాయితీయే.. మీ విలువైన ఆస్తి
- చార్టెడ్ అకౌంట్లకు కేంద్రంగా హైదరాబాద్
- సీయే విద్యార్థుల జాతీయ సదస్సులో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు

సూర్య హైదరాబాద్

తెలంగాణ రైజింగ్.. తెలంగాణ రాష్ట్రం ఈ దేశంలోని ఇతర రాష్ట్రాలతో కాదు ప్రపంచంలో అభివృద్ధి చెందిన దేశాలతో పోటీ పడుతుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. గురువారం ఇనిస్ట్యూట్ ఆఫ్ చార్టెడ్ అకౌంట్స్ ఇండియా, హైదరాబాద్ శాఖల ఆధ్వర్యంలో శిల్పకళా వేదికలో ఏర్పాటుచేసిన సీయే విద్యార్థుల జాతీయస్థాయి సదస్సులో డిప్యూటీ సీఎం ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఫ్యూచర్ సిటీ, మూసి పునర్జీవం, రీజినల్ రింగ్ రోడ్డు తో పాటు అనేక పరిశ్రమలకు కేంద్రంగా తెలంగాణ మారిందని అన్నారు. ఐటీ, ఫార్మా, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, టెక్స్ టైల్ పార్క్ వంటి వాటితో - మిగతా2లో



## బడిబుడి అడుగులు

- రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభమైన పాఠశాలలు
- విద్యార్థులకు.. స్థానిక నేతలు, విద్యాశాఖ అధికారుల స్వాగతం
- ప్రతీచోట తొలి రోజు హడావిడి
- పాఠశాల ప్రారంభం రోజే పుస్తకాలు, యూనిఫాం అందించాలని సీఎం కార్యాలయం అన్ని జిల్లా లకు ఆదేశాలు

## ఒక్కొక్కరి ఆస్తులు రూ.200 కోట్లపైనే!



- నెలన్నరలో ఇద్దరు ఇంజనీర్లపై ఏసీబీ దాడులు
- గత ఏప్రిల్ 26న ఈఎన్సీ భూక్య హరిరామ్ అరెస్టు
- తాజాగా ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీధర్‌కు రిమాండ్
- వీరిద్దరూ కాళేశ్వరంలో కీలకంగా వ్యవహరించిన వారే
- ఏసీబీ నజర్‌లో మరి కొన్ని కాళేశ్వరం తిమింగలాలు

సూర్య హైదరాబాద్

కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో కీలకంగా వ్యవహరించిన ఇంజనీర్ల ఆస్తులపై ఏసీబీ గురిపెట్టింది. ఇంజనీర్ ఇన్ చీఫ్‌గా పనిచేసిన భూక్యా హరిరామ్‌ను గత ఏప్రిల్ 26న అరెస్టు చేసిన ఏసీబీ అధికారులు.. దాదాపు 200కోట్ల విలువైన అక్రమాస్తులను గుర్తించారు. తాజాగా ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నూనె శ్రీధర్‌ను ఏసీబీ అధికారులు బుధవారం అరెస్టు చేసి, గురువారం న్యాయస్థానంలో - మిగతా2లో



## ముందస్తు నివారణ చర్యలే మేలు

- భారీ వర్షాలు, వరదల నష్టంపైమంత్రి పొంగులేటి
- వరద ముప్పు కట్టడికి హైదరాబాద్ మాదిరి జిల్లాల్లో ఏర్పాట్లు
- ప్రకృతి విపత్తుల నిర్వహణ విభాగం బలోపేతానికి ఉన్నతస్థాయి కమిటీ
- ఉన్నతాధికారులతో మంత్రి సమీక్ష

## నియామక ప్రక్రియలపై నమ్మకం పెంపొందాలి



- ఆ దిశగా పబ్లిక్ సర్వీస్ కమిషన్లు సంస్కరణలు తేవాలి
- జాతీయ సదస్సులో యూపీఎస్సీ ఛైర్మన్ అజయ్‌కుమార్

సూర్య హైదరాబాద్

ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ ప్రక్రియలో మరింత నమ్మకం, జవాబుదారీతనం పెంపొందించేలా రాష్ట్రాల పబ్లిక్ సర్వీస్ కమిషన్ల(పీఎస్సీలు) సంస్కరణలు అమలుచేయాల్సిన అవసరం ఉందని యూపీఎస్సీ ఛైర్మన్ అజయ్‌కుమార్ అభిప్రాయపడ్డారు. సాంకేతికతను విస్తృతంగా వినియోగించడం ద్వారా నియామకాల్లో కొత్తగా ఎదురవుతున్న సమస్యలకు పరిష్కారాలు కనుగొనాలని నిర్దేశించారు. న్యాయవివాదాలు రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో - మిగతా2లో


## భారీగా ఐఏఎస్ అధికారుల బదిలీలు

తెలంగాణలో 36 మంది ఐఏఎస్ అధికారులను బదిలీ

రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ

## 'పీఎం కుసుమ్'లో దళారీలు!

- రాష్ట్రంలో సౌరవిద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు అవకాశం పొందిన రైతులతో రాయ'బేరాలు'
- ఈ పథకం లాభదాయకం కాదని నష్టపోతారంటూ ప్రచారం... ఎకరాకు రూ. 33 వేలు లీజు చెల్లిస్తామని.. ఏటా 10% పెంచుతామని హామీ



# ముందస్తు నివారణ చర్యలే మేలు



హైదరాబాద్

భారీ వర్షాలతో తీవ్ర నష్టం జరిగిన తరువాత స్పందించడం కంటే.. నష్టం జరగకముందే నివారణ చర్యలపై ఎక్కువ దృష్టి పెట్టాలని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. గోదావరి, కృష్ణా పరీవాహక ప్రాంతాల్లో ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ ఏడాది రాష్ట్రంలో సాధారణం కంటే అధిక వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ (ఐఎండీ) చెపుతున్న నేపథ్యంలో మంత్రి పొంగులేటి గురువారం సచివాలయంలో ప్రకృతి విప త్తుల నిర్వహణ ఉన్నతాధికారులు, రెవెన్యూ అధి కారులతో ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ హైదరాబాద్ తరహాలోనే జిల్లాల్లో వరదల ముప్పును ఎదుర్కొనేందుకు తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. విపత్తుల నిర్వహణ విభాగం బలోపేతానికి హైడ్రా కమిషనర్, అగ్నిమాపక డీజీ, విపత్తుల నిర్వహణ కమిషనర్, కమాండ్ కంట్రోల్ సెంటర్ డైరెక్టర్, నీటిపారుదల, ఆర్‌అండ్‌బీ, ఆరోగ్య శాఖల కమిషనర్‌లతో ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేశామని, ఈ కమిటీ వారం రోజుల్లో నివేదిక ఇస్తుందని వివరించారు. తర్వాత కమిటీ నివేదిక ప్రకారం చర్యలు చేపడ్తామని తెలిపారు. వర్షాకాలం ముందుస్తుగానే వచ్చిందని, దీనిని దృష్టిలో పెట్టుకుని జిల్లాల కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలని, అన్ని విభాగాల అధికారులతో సమన్వయం చేసుకుని వైపరీత్యాల ప్రభావాన్ని వీలైనంత వరకు తగ్గించాలని మంత్రి ఆదేశించారు. గోదావరి, కృష్ణా నదుల పరీవాహక ప్రాంతాల్లో జూలై, ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో వచ్చే భారీ వర్షాల వల్ల ఊహించని వరదలు వస్తున్నాయని, గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని ఇప్పటి నుంచే పకడ్బందీ చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా పరీవాహక ప్రాంతాల్లోని నివాసితులను గుర్తించి వారిని అక్కడి నుంచి శాశ్వతంగా తరలించి, వారికి ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇచ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

**మూసపద్ధతికి స్వస్తి చెప్పండి..**

విపత్తుల నిర్వహణ విభాగం మూసపద్ధతికి స్వస్తి చెప్పి, మారుతున్న కాలానికి అనుగుణంగా ఆధునిక సాంకేతిక పద్ధతులను, పరిజ్ఞానాన్ని అలవర్చుకోవాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సంబంధిత అధికారులను కోరారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని ఆయా జిల్లాల్లో పరిస్థితులను బట్టి వరదల కార్యాచరణ ప్రణాళికలను ఈనెల 30వ తేదీలోగా తయారు చేసుకోవాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. అలాగే వరద నియంత్రణ కట్టలు, చిన్న%–%మధ్య తరహా కాల్వలు, వర్షపు నీటి డ్రెయిన్‌లు.. మొదలైన వాటిని పరిశీలించి మరమ్మతులు చేపట్టాలన్నారు. బోట్లు, లైఫ్ జాకెట్లు, అత్యవసర ఆహార కిట్లను ముందే సిద్ధం చేసుకోవాలని చెప్పారు.

ఇరిగేషన్, రెవెన్యూ, పోలీస్, ఆరోగ్య శాఖలు సమన్వయంతో పనిచేయాలని, స్థానిక సహాయక బృందాలను ఏర్పాటు చేసి, వారికి బాధితులను తరలించడం, తక్షణ స్పందన చర్యలపై శిక్షణ ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో రెవెన్యూ శాఖ ముఖ్యకార్యదర్శి నవీన్ మిత్తల్, విపత్తుల నిర్వహణ కమిషనర్, అగ్నిమాపక విభాగం డైరెక్టర్ జనరల్ నాగిరెడ్డి, హైడ్రా కమిషనర్ రంగనాథ్, పంచాయితీరాజ్ కమిషనర్ సృజన, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ‘పీఎం కుసుమ్’లో దళారీలు!

హైదరాబాద్

కేంద్ర ప్రభుత్వ పథకమైన ప్రధానమంత్రి కిసాన్ ఉర్జా సురక్షా ఏవం ఉత్థాన్ మహాభియాన్ (పీఎం కుసుమ్) కింద ఒకటి, రెండు మెగావాట్ల సౌరవిద్యుత్ ప్లాంట్లు ఏర్పాటు చేసే అవకాశం పొందిన రాష్ట్ర రైతులపై దళారీలు గద్దల్లా వాలుతున్నారు. ఈ పథకం లాభదాయకం కాదని.. సాంకేతిక పరిజ్ఞానం లేనందున గిట్టుబాటుకాక నష్టపోతారని ప్రచారంచేస్తూ ఒత్తిడి తెస్తున్నారు. ఎకరాకు లీజు కింద రూ. 33 వేలు చెల్లిస్తామని.. ఏటా దాన్ని 10 శాతం పెంచుతామని ప్రలోభాలకు గురిచేస్తూ అనుమతులను తమకు ఇచ్చేయాలని దళారులతోపాటు సౌర ఫలకాల తయారీ సంస్థలు నేరుగా రైతులకే ఫోన్లు చేస్తున్నాయి. అర్హత ఉన్న వారికి ఉద్యోగం కూడా కల్పిస్తామని నమ్మబలుకుతున్నాయి.

**3 వేల మెగావాట్లు కాస్తా..**

వాయు కాలుష్యానికి కారణమయ్యే డీజిల్ పంపుసెట్ల స్థానంలో సౌరశక్తితో నడిచే పంపుసెట్లను రైతులు ఉపయోగించేలా ప్రోత్సహించడంతోపాటు వారు అదనపు ఆదాయం పొందేందుకు 2 మెగావాట్ల వరకు సౌరవిద్యుత్ ప్లాంట్లను ఏర్పాటు చేసే ఉద్దేశంతో కేంద్రం పీఎం కుసుమ్ పథకాన్ని తీసుకొచ్చింది. సోలార్ పంపుసెట్లపై 30 శాతం నుంచి 50 శాతం వరకు రాయితీ కూడా అందిస్తోంది. ఈ పథకం కింద రాష్ట్రంలో మొత్తం 3,000 మెగావాట్ల సౌరవిద్యుత్ ప్లాంట్లను ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. ఇందుకోసం మెగావాట్‌కు దాదాపు రూ. లక్ష వరకు ఈఎండీ (ఎర్నెస్ట్ మనీ డిపాజిట్) చెల్లించాలని పేర్కొంది. 25 ఏళ్లపాటు రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థలు విద్యుత్‌ను యూనిట్‌కు రూ. 3.13 చొప్పున కొనేలా ఒప్పందం (పీపీఏ) చేసుకుంటాయని వెల్లడించింది. ఇందుకోసం బ్యాంకులు రుణాలు కూడా మంజూరు చేస్తాయని వివరించింది. అయితే సొంత భూమి లేదా లీజుకు తీసుకున్న భూమి ఉంటేనే ఈ పథకం కింద రైతులు అర్హులని పేర్కొంది. దీంతో దాదాపు 6,000 మెగావాట్ల వరకు సోలార్ విద్యుత్ ప్లాంట్లను ఏర్పాటు చేయడానికి దరఖాస్తులు వచ్చాయి. అయితే తాము నిర్దేశించిన గడువులోగా రాష్ట్ర ప్రభుత్వం దరఖాస్తులు స్వీకరించలేదంటూ కేంద్రం 3,000 మెగావాట్ల పథకాన్ని కాస్తా 1,000 మెగావాట్లకు కుదించింది. రాష్ట్ర ప్రభుత్వం పలుమార్లు విజ్ఞప్తి చేయడంతో చివరకు ఈ పథకాన్ని 1,450 మెగావాట్లకు పెంచింది. రైతులు, రైతు బృందాలు, స్వయం సహాయక బృందాలు, ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్లు, ప్రైవేటు వ్యక్తులు 6,000 మెగావాట్ల కోసం దరఖాస్తు చేసినా ఈఎండీ చెల్లించింది మాత్రం 1,600 మెగావాట్లకే కావడంతో ఈ ఏడాది 1,450 మెగావాట్లకు మాత్రమే అనుమతులిచ్చే అవకాశం ఉంది.

**65 శాతం రైతుల నుంచే..**

ప్రభుత్వానికి అందిన దరఖాస్తుల్లో సుమారు 65 శాతం రైతుల నుంచే వచ్చాయని విశ్వసనీయంగా తెలిసింది. అయితే ఎక్కువ మంది రైతులు ఒకటి, ఒకటిన్నర మెగావాట్ కోసం దరఖాస్తు చేసుకోగా కొందరు రెండు మెగావాట్లకు దరఖాస్తు చేసుకున్నారు. వారిలో ప్రభుత్వం నుంచి లెటర్ ఆఫ్ అగ్రిమెంట్ పొందిన రైతుల వద్దకు దళారులు ప్రత్యక్షమవుతున్నారు. ఆయా రైతులు ఆది, సోమవారాల్లో దక్షిణ డిస్కంతో పీపీఏలు కుదుర్చుకోవడానికి రాగా అక్కడ కూడా వారిని ప్రలోభపెట్టేందుకు ప్రయత్నించారు.

కొందరు ఉద్యోగులు కూడా దళారులకు వత్తాసు పలుకుతున్నట్లు సమాచారం. కాగా, విద్యుత్ ప్లాంట్లు నెలకొల్పడానికి ఎక్కువగా మహబూబ్‌నగర్, నల్లగొండ జిల్లా నుంచి అధికంగా దరఖాస్తులు వచ్చినట్లు టీజీ రెడ్కో అధికారులు వివరించారు. ప్రభుత్వం ఇప్పటివరకు దాదాపు 70 నుంచి 80మంది రైతులతో పీపీఏలు కుదుర్చుకుంది. ఎస్‌పీడీసీఎల్ జూలై 7 వరకు పీపీఏ ప్రక్రియ కొనసాగుతుందని ఓ అధికారి వివరించారు.

**మెగావాట్‌కు ఏడాదికి 16 లక్షల యూనిట్ల విద్యుత్..**

సోలార్ విద్యుత్ ప్లాంట్‌లో ఒక మెగావాట్‌కు ఏడాదికి 16 లక్షల యూనిట్ల విద్యుదుత్పత్తి అవుతుందని అంచనా. సోలార్ ప్యానెల్స్ మేలు రకమైనవి అయితే ఇంకాస్త విద్యుత్ ఉత్పత్తి అవుతుందని అధికార వర్గాల సమాచారం. పీపీఏలు చేసుకున్న తర్వాతే బ్యాంకులు రుణాలు ఇవ్వడానికి మొగ్గుచూపుతున్నాయి.

అయితే ఒక మెగావాట్‌కు మూడు కోట్ల వరకు వ్యయం అవుతుండగా బ్యాంకులు మాత్రం మెగావాట్‌కు రూ. 2 కోట్ల వరకు మాత్రమే రుణాలు ఇవ్వడానికి అంగీకరిస్తున్నాయని.. మిగిలిన నిధులకూ పూచీకత్తు ఇవ్వాలంటున్నారని ఔత్సాహిక రైతులు రఘురామ్, అర్జున్ వివరించారు. 25 ఏళ్ల వరకు పీపీఏలు ఉన్న నేపథ్యంలో మొదట్లో భారీగా ఆదాయం రాకపోయినా పదేళ్ల తరువాత నిర్వహణ వ్యయం పోనూ ఏటా రూ. 15%–%20 లక్షల వరకు ఆదాయం లభించే అవకాశం ఉంటుందని చెబుతున్నారు.

# ఆర్థిక ఆరోగ్య భద్రత సీయేల చేతుల్లోనే

-మొదటిపేజీ తరువాయి

అభివృద్ధిలో ప్రపంచ పటంలో సుస్థిర స్థానాన్ని ఏర్పరచుకుందని వివరించారు. శర వేగంగా అభివృద్ధి చెందుతున్న తెలంగాణ దేశవ్యాప్తంగా బయటికి వస్తున్న సీయే విద్యార్థులకు కూడా వేదికగా మీ ముందు ఉందని అన్నారు. సీయే కోర్స్ పూర్తి చేసుకుని వస్తున్న విద్యార్థులకు తెలంగాణ రాష్ట్రంలో అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని భరోసా ఇచ్చారు. భారతదేశ ఆర్థిక, ధన, వినియోగ నైతికతకు మూల స్తంభంగా ఇనిస్ట్యూట్ ఆఫ్ చార్టెడ్ అకౌంట్స్ ఇండియా (ఎఅంఎ) నిలుస్తుంది అన్నారు. చార్టెడ్ అకౌంట్ టెంట్లు నైతికతకు కట్టుబడి ఉండాలని, టెక్నాలజీ ఆటోమేషన్ శరవేగంగా పెరుగుతున్న ఈ యుగంలో మీ నిజాయితీయే మీకు అత్యంత విలువైన ఆస్తి, మీ పని ఎల్లప్పుడూ నిజాయితీ, సమన్యాయం బాధ్యతను ప్రతిబింబించాలని డిప్యూటీ సీఎం ఆకాంక్షించారు.

**ఐసీఏఐ ప్రజల నమ్మకానికి నిలువెత్తు నిదర్శనం**

1949 లో పార్లమెంటు చట్టంతో స్థాపించబడిన ఇనిస్ట్యూట్ ఆఫ్ చార్టర్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియన్ హృదయపూర్వకంగా అభినందిస్తున్నానని తెలిపారు. ఈ సంస్థ ఆర్థిక క్రమశిక్షణ, వృత్తిపరమైన విలువలు, ప్రజల నమ్మకానికి ఒక నిలువెత్తు నిదర్శనం అన్నారు. దేశవ్యాప్తంగా 4.26 లక్షలకు పైగా సభ్యులు, దాదాపు పది లక్షల మంది విద్యార్థులతో మీరు ఒక బలమైన ఆర్థిక శక్తిగా మారారని డిప్యూటీ సీఎం అభివర్ణించారు. ఇందులో హైదరాబాద్ బ్రాంచ్ పాత్ర మరింత విశిష్టమైనది 14,500 మందికి పైగా సభ్యులు, 31,000 మందికిపైగా విద్యార్థులతో ఇది ఎఅంఎ కి విలువైన ఆభరణంగా నిలిచింది మీరు కేవలం అంకెలు, సంఖ్యలు కాదు ఒక శక్తి, ఒక ఆశయం, ఒక ప్రతిభకు ప్రతీక అన్నారు.

చార్టెడ్ అకౌంటెంట్ కావడం అంటే పరీక్షలు పాస్ కావడమే కాదు ఇది నిరంతర అభ్యాసం, అనుభవం, వ్యక్తిత్వ వికాసాన్ని కలగలిపిన ఒక ప్రయాణం అని డిప్యూటీ సీఎం తెలిపారు. ఆర్థిక మంత్రిగా మీ వృత్తిపరమైన ప్రభావాన్ని ప్రతిరోజు చూస్తుంటాను చార్టెడ్ అకౌంట్ లు కేవలం అంకెలు సంఖ్యలు చూసేందుకే పరిమితం కారు మీరు నిబంధనలకు కట్టుబడి ఉండేలా చూస్తారు ప్రమాణాలను పాటిస్తారు సంక్లిష్టతకు స్పష్టత తీసుకొస్తారని తెలిపారు.

ప్రపంచవ్యాప్తంగా సేవలందించే ప్రతిభావంతులైన వృత్తి నిపుణులను ఎఅంఎ తయారు చేయడం మనందరికీ గర్వకారణం అన్నారు. సీఏ విద్యార్థులు కేవలం ఒక ఉద్యోగం కోసం సిద్ధం కావడం లేదు. మీరంతా భవిష్యత్తులో వ్యాపారాలు, సంస్థలు, ప్రభుత్వాల ఆర్థిక ఆరోగ్యానికి బాధ్యత వహించేందుకు సిద్ధమవుతున్నారని తెలిపారు. ఒక చార్టెడ్ అకౌంటెంట్ బాధ్యతలు బ్యాలెన్స్ సీట్లకే పరిమితం కావు మీరు అభివృద్ధికి భాగస్వాములు, ప్రజల నమ్మకానికి రక్షకులు, నీటి నిర్వహణకు మార్గదర్శకులు అని డిప్యూటీ సీఎం పేర్కొన్నారు. ఈరోజు భారతదేశం ఐదు ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థగా ఎదగాలని లక్ష్యంగా పెట్టుకొని ముందుకు సాగుతున్న సమయంలో చార్టెడ్ అకౌంట్ లో పాత్ర మరింత ప్రాధాన్యత సంతరించుకుంది. బిజినెస్ రిఫార్మ్, స్టార్టప్ లకు చేయూత, ప్రజా ఆర్థిక వ్యవస్థల బలోపేతం ఇవన్నీ సీఏ ల పాత్రతోనే ముందుకు సాగుతాయి అన్నారు. బ్లాక్ చైన్, ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ తో కూడిన అకౌంటింగ్, డిజిటల్ పన్నుల వంటి అంశాల్లో పరిణామాలు వేగంగా జరుగుతున్నాయి ఈ నేపథ్యంలో సమకాలీన పరిజ్ఞానాన్ని మెరుగు పరుచుకోవాలని డిప్యూటీ సీఎం అం విద్యార్థులకు సూచించారు. మీ ప్రతిభను కేవలం సంపాదనకే కాకుండా సేవకు వినియోగించాలి, సోషల్ ఆడిట్లు చేయండి, చిన్న వ్యాపారాల ఆర్థిక అభివృద్ధికి తోడ్పడాలని, ప్రభుత్వ ఆర్థిక ప్రణాళిక కార్యక్రమాలలో పాల్గొని దేశ నిర్మాణంలో భాగస్వాములు కావాలని డిప్యూటీ సీఎం ఆశించారు.

**ఉద్యోగ దాతులుగా మారండి**

మీలో చాలామంది భవిష్యత్తులో సొంత సంస్థలు స్థాపిస్తారు. మీరు ఉద్యోగులుగా కాకుండా ఉద్యోగ దాతలుగా మారాలని కొత్త ఉద్యోగ అవకాశాలను సృష్టించాలని డిప్యూటీ సీఎం సీఏ విద్యార్థులకు పిలుపునిచ్చారు. కష్టపడి సాధించాల్సిన ఉన్నత మార్గాన్ని ఎంచుకున్నందుకు సిఏ విద్యార్థులకు అభినందనలు తెలిపారు. అం ప్రయాణం అంత సులభమైనది కాదు కానీ ఎంతో సార్థకమయింది, మీ విజయం కేవలం మీకు మాత్రమే చెందదు అది భారతదేశ పురోగతికి చేయూతనిస్తుందని, గొప్ప వృత్తి గౌరవాన్ని ఎప్పటికీ నిలబెట్టాలని తాను కోరుకుంటున్నట్లు డిప్యూటీ సీఎం తెలిపారు.

## బడిబుడి అడుగులు



హైదరాబాద్

రాష్ట్రవ్యాప్తంగా గురువారం పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయి. ప్రతీచోట తొలి రోజు హడావిడి కనిపించింది. విద్యార్థులకు.. స్థానిక నేతలు, విద్యాశాఖ అధికారులు స్వాగతం పలికారు. ప్రభుత్వ, ప్రైవేటు స్కూళ్లల్లో స్వాగత బ్యానర్లు, పోస్టర్లు వెలిశాయి. యాభైరోజుల తర్వాత కలుసు కున్న విద్యార్థులు ఒకరినొకరు ఆలింగనం చేసుకోవడం కనిపించింది. అన్నిచోట్ల తొలిరోజే పాఠ్యపుస్త కాలు, యూనిఫాం అందించారు. మొత్తంగా 50 లక్షల పాఠ్యపుస్తకాలు, 20 లక్షల యూనిఫాం అంద జేసినట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు. పాఠశాల ప్రారంభం రోజే పుస్తకాలు, యూనిఫాం అందించాలని సీఎం కార్యాలయం అన్ని జిల్లా లకు ఆదే శాలు ఇచ్చింది. పంపిణీ కార్యక్రమాలపై సీఎంవో వివరాలు తెప్పించుకుంది. కొన్ని జిల్లాల్లో పుస్తకాల పంపిణీ ఆలస్యమవ్వడం, మరికొన్ని చోట్ల అందరికీ అందుబాటులో యూనిఫాం లేకపోవడంతో పంపిణీ జరగలేదు. వారం రోజుల్లో అన్ని పాఠశాలల్లో పూర్తి స్థాయిలో పంపిణీ చేస్తామని అధికారులు చెబుతున్నా రు. పాఠశాలలను తెరిచే నాటికే.. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 27,852 ప్రభుత్వ, ఎయిడెడ్, గురుకుల పాఠశా లలకు 1,01,66,220 పుస్తకాలు చేరాయని ముఖ్య మంత్రి కార్యాలయం తెలిపింది. తొలిరోజు పాఠశాల లకు 8,33,398 లక్షల మంది హాజరయ్యారని, వీరిలో 54,52,708 మందికి పుస్తకాలు అందించా మని సీఎంవో పేర్కొంది. ఈ ఏడాది మొత్తం 20,30,667 మంది విద్యార్థులకు యూనిఫాంలు అందజేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. తొలి రోజు పాఠశాలలకు హాజరైన 8,33,398 విద్యార్థులకు ఒక జత యూనిఫాంలను ఉపాధ్యాయులు అందజేశారు. రెండో జత త్వరలో అందిస్తామని విద్యాశాఖ తెలిపింది. ఈ ఏడాది నుంచి పాఠశా లల్లో ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్‌ను ఒక సబ్జెక్టుగా బోధిస్తారు. దీనికి సంబంధించిన పుస్తకాలను కూడా విద్యార్థులకు అందజే శారు. అయితే ప్రభుత్వ, ప్రైవేటు స్కూళ్లల్లో తొలి రోజు విద్యార్థుల హాజరు తక్కువగా నమోదైంది.

## ఒక్కొక్కరి ఆస్తులు రూ.200 కోట్లపైనే!

-మొదటిపేజీ తరువాయి

హాజరుపరిచారు. ఈ మేరకు శ్రీధర్‌ను 14రోజుల జ్యూడీషియల్ రిమాండ్‌కు తరలించాలని న్యాయమూర్తి ఆదేశించారు. కాగా, శ్రీధర్ నివాసం, ఇతర ప్రాంతాల్లో జరిపిన తనిఖీల్లో రూ.200కోట్లపైగా ఆస్తులను ఆయన కూడబెట్టినట్లు గుర్తించారు. శ్రీధర్‌కు సంబంధించిన బ్యాంకు లాకర్లలో భారీగా బంగారు ఆభరణాలు ఉన్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అలాగే, అతడి బినామీల వ్యవహారాలు తెలుసుకునేందుకు కస్టడీ పిటిషన్ వేసి మరింత లోతుగా విచారించాలని ఏసీబీ అధికారులు భావిస్తున్నట్లు తెలుస్తోంది. కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి ఇటీవల విజిలెన్స్ అధికారులు ప్రభుత్వానికి ఇచ్చిన నివేదిక ఆధారంగా అక్రమార్జనకు పాల్పడిన ఇంజనీర్లపై ఏసీబీ నిఘా కొనసాగిస్తుంది. పక్కా సమాచారం సేకరించిన తర్వాతే సోదాలు చేపట్టి, కేసులు నమోదు చేస్తున్నారు. శ్రీధర్, హరిరామ్ కేసుల్లోనూ లగ్జరీ విల్లాలు, ఫ్లాట్లు, ఖరీదైన ఏరియాల్లో ఇళ్ల స్థలాలు, వాణిజ్య సముదాయాలు ఉన్నట్లు ఏసీబీ గుర్తించింది.

## భారీగా ఐఏఎస్ అధికారుల బదిలీలు

హైదరాబాద్

తెలంగాణలో 36 మంది ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

ఎన్.శ్రీధర్ – పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి ముఖ్య కార్యదర్శి. గనులశాఖ ముఖ్యకార్యదర్శిగా అదనపు బాధ్యతలు
లోకేశ్ కుమార్– రెవెన్యూశాఖ ముఖ్య కార్యదర్శి
నవీన్ మిత్తల్– ఇంధనశాఖ ముఖ్యకార్యదర్శి
జ్యోతి బుద్ధప్రకాష్ –ఎస్సీ అభివృద్ధిశాఖ కార్యదర్శి
శశాంక్ గోయెల్ –ఢిల్లీలో తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్
హరిచందన దాసరి– హైదరాబాద్ కలెక్టర్
రాజీవ్‌గాంధీ హనుమంతు– రిజిస్ట్రేషన్స్ అండ్ స్టాంప్స్ స్పెషల్ సెక్రటరీ, ఐజీ
భారతి లక్‌పతి నాయక్ – సమాచారశాఖ కమిషన్ కార్యదర్శి
కిల్లు శివకుమార్ నాయుడు –ఆర్‌అండ్‌ఆర్ కమిషనర్
చిట్టెం లక్ష్మి – సాధారణ పరిపాలన విభాగం సంయుక్త కార్యదర్శి
ఇ.నవీన్ నికోలస్ – స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్
టి.వినయ్ కృష్ణారెడ్డి– నిజామాబాద్ కలెక్టర్
సృజన– మహిళాశిశుసంక్షేమశాఖ డైరెక్టర్‌గా అదనపు బాధ్యతలు
ఎల్.శివశంకర్– వ్యవసాయ సహకార శాఖసంయుక్త కార్యదర్శి, విపత్తు నిర్వహణ సంయుక్త కార్యదర్శిగా అదనపు బాధ్యతలు
కె.హైమావతి– సిద్దిపేట కలెక్టర్
పి.గౌతమ్– సింగరేణి డైరెక్టర్
వాసం వెంకటేశ్వర్‌రెడ్డి– ఎయిడ్స్ నియంత్రణ సొసైటీ డైరెక్టర్
కె.నిఖిల– మత్స్యశాఖ డైరెక్టర్
వల్లూరు క్రాంతి– పర్యాటకశాఖ ఎండీ
పి.ఉదయ్ కుమార్– ఆరోగ్యశ్రీ హెల్త్ ట్రస్ట్ సీఈవో
ప్రియాంక ఆల– టీజీపీఎస్సీ కార్యదర్శి
పి.ప్రావిణ్య– సంగారెడ్డి కలెక్టర్
మిక్కిలినేని మను చౌదరి– మేడ్చల్ మల్కాజిగిరి కలెక్టర్
అనుదీప్ దురిశెట్టి– ఖమ్మం కలెక్టర్
స్నేహ శబరీష్– హనుమకొండ కలెక్టర్
జి.మల్సూర్ – ముఖ్యమంత్రి సీపీఆర్‌వో
జె.శంకరయ్య– ఆయిల్‌ఫెడ్ ఎండీ
పి.శ్రీకాంత్‌బాబు– ఆయుష్ డైరెక్టర్
పవన్‌కుమార్– టీజీఐఐసీ ఈడీగా అదనపు బాధ్యతలు
ఎ.నిర్మల కాంతి వెస్లీ– రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ కార్యదర్శి, సీఈవో
ముజామిల్ ఖాన్– పౌరసరఫరాల డైరెక్టర్
నిఖిల్ చక్రవర్తి– పరిశ్రమలశాఖ డైరెక్టర్
వి.ఎస్.ఎన్.వి.ప్రసాద్– హెచ్‌ఎండీఏ అర్బన్ ఫారెస్ట్రీ డైరెక్టర్

# మహా విషాదం..

అహ్మదాబాద్

మాటలకందని పెనువిషాదం. భారత విమానయాన చరిత్రలోనే అత్యంత దారుణమైన ఘటన. గురువారం గుజరాత్‌లో ఘోర విమాన ప్రమాదం జరిగింది. 230 మంది ప్రయాణికులు, 12 మంది సిబ్బందితో అహ్మదాబాద్‌లోని సర్దార్ వల్లబాయ్ పటేల్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి మధ్యాహ్నం 1.39 గంటలకు లండన్ బయల్దేరిన ఎయిరిండియా బోయింగ్ 787%–%8 డ్రీమ్‌లైనర్ ఏఐ171 విమానం టేకాఫైన 39 సెకన్లలోనే కుప్పకూలింది. కేవలం 625 అడుగుల ఎత్తుకు వెళ్లగానే విమానంలో అనూహ్య సమస్య తలెత్తింది. దాంతో అది శరవేగంగా కిందికి దూసుకొచ్చింది. చూస్తుండగానే రన్‌వే సమీపంలో మేఘానీనగర్‌లోని బీజే మెడికల్ కాలేజీ, సిటీ సివిల్ హాస్పిటల్ సముదాయంపై పడి ఒక్కసారిగా పేలిపోయింది. ఒళ్లు గగుర్పొడిచే ఈ దారుణంలో విమాన ప్రయాణికుల్లో ఒక్కరు మినహా 241 మందీ దుర్మరణం పాలయ్యారు. మృతుల్లో గుజరాత్ మాజీ ముఖ్యమంత్రి విజయ్ రూపానీ కూడా ఉన్నారు. 230 మంది ప్రయాణికుల్లో 169 మంది భారతీయులు కాగా 53 మంది బ్రిటన్‌వాసులు, ఏడుగురు పోర్చుగల్‌వాసులు, ఒకరు కెనడా పౌరుడు. వీరితో పాటు ఇద్దరు పైలట్లు, 10 మంది సిబ్బంది ఉన్నారు. బ్రిటన్‌లో స్థిరపడ్డ రమేశ్ విశ్వాస్‌కుమార్ బుచర్వాడ (38) అనే ప్రయాణికుడు గాయాలతో బయటపడి ఆస్పత్రిలో కోలుకుంటున్నారు. విమానం తొలుత మెడికల్ కాలేజీ క్యాంటీన్‌పై పడి పేలిపోయింది. ముక్కలై మంటల్లో కాలిపోతూనే పక్కనున్న బాయ్స్ హాస్టల్ భవనంపైకి దూసుకెళ్లింది. దాంతో రెండు భవనాలూ తీవ్రంగా ధ్వంసమయ్యాయి. వాటితో పాటు పరిసరాల్లోని పలు బహుళ అంతస్తుల భవనాలు కూడా మంటలంటుకుని కాలిపోయాయి. ప్రమాద సమయంలో క్యాంటీన్లో చాలామంది వైద్య విద్యార్థులు, రెసిడెంట్ డాక్టర్లు మధ్యాహ్న భోజనం చేస్తున్నారు. వారితో పాటు హాస్టల్‌వాసుల్లో కూడా పలువురు ప్రమాదంలో గాయపడ్డారు.

వారిలో కనీసం 25 మంది మరణించినట్టు చెబుతున్నారు! ఒక వైద్యుడు, నలుగురు ఎంబీబీఎస్ విద్యార్థులు, వైద్యుని భార్య మృతిని ఆస్పత్రి వర్గాలు ధ్రువీకరించాయి. "60 మందికి పైగా వైద్యులు, వైద్య విద్యార్థులు గాయపడ్డారు. వారిలో 19 మందికి తీవ్ర గాయాలయ్యాయి. ఐదుగురి పరిస్థితి విషమంగా ఉంది" అని ఫెడరేషన్ ఆఫ్ ఆలిండియా మెడికల్ అసోసియేషన్ పేర్కొంది. వారందరినీ హుటాహుటిన ఆస్పత్రులకు తరలించారు. ఈ నేపథ్యంలో మృతుల సంఖ్య మరింత పెరిగేలా ఉంది. ఇద్దరు ఎంబీబీఎస్ మూడో సంవత్సరం విద్యార్థులు, ఒక వైద్యుని తాలూకు ముగ్గురు బంధువుల ఆచూకీ తెలియడం లేదని కాలేజీ డీన్ డాక్టర్ మీనాక్షీ పారిఖ్ వెల్లడించారు. విమాన శకలాలు, ధ్వంసమై కాలిపోయిన భవనాలు, కార్లు, చెట్లు తదితరాలతో ప్రమాదస్థలి భీతావహంగా మారింది. విమానాశ్రయ, అగ్నిమాపక, ఎన్డీఆర్ఎఫ్, బీఎస్ఎఫ్, సీఐఎస్ఎఫ్, సైనిక, స్థానిక సిబ్బంది హుటాహుటిన రంగంలోకి దిగి సహాయక చర్యలు చేపట్టారు.

ప్రమాద ధాటికి దాదాపుగా విమానంలోని వారంతా కాలిపోయి తీవ్రగాయాల పాలయ్యారు. వారిని బయటికి తీసి ఆ ప్రాంగణంలోనే ఉన్న సిటీ సివిల్ ఆస్పత్రికి తరలించారు. ఈ దారుణంపై భారత్‌తో పాటు ప్రపంచ దేశాలన్నీ దిగ్భ్రాంతికి లోనయ్యాయి. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీతో పాటు బ్రిటన్ రాజు చార్లెస్%–%3, ప్రధాని యిర్ స్టార్మర్, పలువురు దేశాధినేతలు, రాజకీయ తదితర రంగాల ప్రముఖులు సంతాపం వెలిబుచ్చారు. జరిగింది మాటలకందని దారుణమని మోదీ అన్నారు. శుక్రవారం ఆయన ఘటనాస్థలిని సందర్శించనున్నారు.

**హాస్టల్‌లోకి చొచ్చుకెళ్లిన విమానం**

పైలట్ 'మే డే' అలర్ట్

విమానం మధ్యాహ్నం 1.39కి టేకాఫ్ అయింది. 600 అడుగుల పై చిలుకు ఎత్తుకు వెళ్లిందో లేదో సమస్య తలెత్తింది. దాంతో మరింత పైకి వెళ్లాల్సిన విమానం కాస్తా కిందకు రాసాగింది. అప్పటికింకా కనీసం లాండింగ్ గేర్ కూడా పూర్తిస్థాయిలో మూసుకోలేదు! దాంతో తీవ్ర ప్రమాదాన్ని సూచిస్తూ పైలట్ వెంటనే ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్‌కు 'మే డే' కాల్ చేశారు. "ఏటీసీ తక్షణం స్పందించి తిరిగి కాల్ చేసినా అప్పటికే పరిస్థితి చేయి దాటిపోయింది.

పైలట్ నుంచి ఎలాంటి స్పందనా రాలేదు" అని డైరెక్టర్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) ఒక ప్రకటనలో పేర్కొంది. చుట్టుపక్కల వాళ్లంతా చూస్తుండగానే క్షణాల్లో ఘోరం జరిగిపోయింది. ప్రమాదం తాలూకు వీడియో ప్రపంచవ్యాప్తంగా వైరలైంది. విమానం తాలూకు జంట ఇంజన్లలో టేకాఫ్‌కు అవసరమైన పూర్తిస్థాయి థ్రస్ట్ లోపించడమే ప్రమాదానికి కారణమని వైమానిక నిపుణులు భావిస్తున్నారు. లేదంటే ఇంజన్లను పక్షులు ఢీకొట్టి ఉండొచ్చని కూడా చెబుతున్నారు. ప్రమాదం నేపథ్యంలో అహ్మదాబాద్ విమానాశ్రయంలో కార్యకలాపాలు సాయంత్రం దాకా నిలిచిపోయాయి. "విమానం చాలా తక్కువ ఎత్తులో ఎగురుతూ మెడికల్ కాలేజీలో డాక్టర్లు, నర్సింగ్ సిబ్బంది నివాస క్వార్టర్లపై కూలిపోయింది. వాటికి మంటలు అంటుకుని లోపలున్న చాలామంది గాయపడ్డారు" అని హరేశ్ షా అనే ప్రత్యక్ష సాక్షి చెప్పుకొచ్చాడు.

**ప్రమాద సమయంలో విమానంలో 1.25 లక్షల లీటర్ల ఇంధనం!**

**ఎవరినీ కాపాడలేకపోయాం: అమిత్ షా**

ప్రమాద సమయంలో ఎయిరిండియా విమానంలో 1.25 లక్షల లీటర్ల ఇంధనం ఉన్నట్టు కేంద్ర హోం మంత్రి అమిత్ షా తెలిపారు. "అదంతా ఒక్కసారిగా అంటుకోవడంతో తీవ్రమైన మంటలు చెలరేగి భరించలేనంత వేడి పుట్టుకొచ్చింది. దాంతో ఎవరినీ కాపాడే అవకాశం లేకుండా పోయింది" అని చెప్పారు. డీఎన్ఏ పరీక్షల ద్వారా మృతదేహాలను గుర్తించిన అనంతరం మృతుల సంఖ్యపై అధికారిక ప్రకటన వెలువడుతుందన్నారు. "డీఎన్ఏ శాంపిళ్లను ఇప్పటికే సేకరించారు. గుజరాత్‌లోని ఫోరెన్సిక్ సైన్స్ లేబొరేటరీ, నేషనల్ ఫోరెన్సిక్ సైన్సెస్ వర్సిటీ డీఎన్ఏ పరీక్షలు నిర్వహిస్తాయి"అని తెలిపారు.

**సెకెనుకు 4 లీటర్ల ఇంధనం**

విమాన ఇంధనాన్ని జెట్ ఫ్యూయల్ లేదా జెట్ ఏ1 అని పిలుస్తారు. బోయింగ్ 747 విమానం నడవాలంటే భారీగా ఇంధనం కావాలి. సెకెనుకు 4 లీటర్లు ఖర్చవుతుంది. అంటే నిమిషానికి 240 లీటర్లు, గంటకు 14,400 లీటర్లు కావాలన్నమాట. అహ్మదాబాద్ నుంచి లండన్‌కు సుమారు 6,859 కి.మీ. దూరానికి 9 గంటలపైనే ప్రయాణం. ఎయిరిండియా విమానంలో అంత భారీగా ఇంధనం ఉండటానికి అదే కారణం. విమానం వేగంగా, బలంగా నేలను తాకగానే అంత ఇంధనం ఒకే మండిపోయింది. దాంతో భారీగా మంటలు చెలరేగి ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. ప్రమాదానికి కారణం తేలాల్సి ఉంది. విమానం బ్లాక్ బాక్స్ కోసం అన్వేషిస్తున్నారు.

**మెడికల్ కాలేజీలో హృదయ విదారక దృశ్యాలు**

విమాన కుప్పకూలిన బీజే మెడికల్ కాలేజీలో హృదయ విదారక దృశ్యాలు మనసులను మెలిపెడుతున్నాయి. కుప్పకూలిన హాస్టల్ భవనాలు తదితరాల కింద చాలామంది వైద్య విద్యార్థులు, ఆస్పత్రి సిబ్బంది తదితరులు చిక్కుకుని ఉంటారని ఫెడరేషన్ ఆఫ్ ఆలిండియా మెడికల్ అసోసియేషన్ (ఎఫ్ఏఐఎంఏ) తెలిపింది. వారిని వెలికితీసేందుకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపడుతున్నారు. ఇప్పటిదాకా 265 మృతదేహాలను సిటీ సివిల్ ఆస్పత్రికి తరలించినట్టు డీఎస్పీ కనన్ దేశాయ్ వెల్లడించారు. మృతుల సంఖ్య భారీగా పెరగవచ్చని ఎఫ్ఏఐఎంఏ జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టర్ దివ్యాన్‌ష్ సింగ్ అన్నారు. వెలికితీసిన మృతదేహాలన్నీ పూర్తిగా కాలిపోయి ఉన్నాయని చెప్పారు.


# దత్తతలో నకిలీ సర్టిఫికెట్ల దందా

వరంగల్

దత్తత ప్రక్రియలో కొందరు బాలల సంరక్షణ విభాగాధికారులు దందాకు తెర లేపారన్న ఆరోపణలున్నాయి. తక్కువ వయసున్న పిల్లల కోసం..కొందరు దంపతులు తమ వయసును తక్కువగా చూపించేందుకు కొన్ని స్కూళ్ల నుంచి స్టడీ, కండక్ట్, డేట్ ఆఫ్ బర్త్ సర్టిఫికెట్లు తీసుకున్నారు. కొందరైతే చదువుకోకున్నా, స్టడీ సరిఫికెట్లు తీసుకున్న ఘటనలు కూడా వెలుగుచూశాయి. తెర వెనుక ఉండి కొందరు అధికారులు ఈ తతంగాన్ని నడిపించనట్టు తెలుస్తోంది. వాస్తవానికి నిరక్షరాస్యులకు వయసు ధ్రువీకరణ పత్రం ప్రభుత్వామోదిత వైద్యుడి వద్ద ఓసిఫికేషన్ పరీక్ష నివేదిక ఆధారంగా తీసుకోవచ్చు. లేదంటే పాన్‌కార్డులోని పుట్టిన తేదీ ఉంటే సరిపోతుంది. అయితే ఎక్కువ వయసున్న దంపతులకు తక్కువ వయసు పిల్లలను దత్తత ఇచ్చే అవకాశం లేదని అధికారులే 'మామూలు'గా మాట్లాడతారు. కొందరు ప్రైవేట్ పాఠశాలల యజమానులతో కుమ్మక్కై సర్టిఫికెట్లను తీసుకొచ్చి వాటినే ఒరిజినల్‌గా చూపిస్తూ సెంట్రల్ అడాప్షన్ రిసోర్స్ అథారిటీ (కారా) వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. వాస్తవానికి దంపతులిద్దరి వయసు కలిపి 85 ఏళ్లుంటే రెండేళ్లలోపు పిల్లలు, 90 ఏళ్లుంటే రెండేళ్ల నుంచి నాలుగేళ్లలోపు, 100 ఏళ్లుంటే నాలుగు నుంచి ఎనిమిదేళ్లలోపు పిల్లలు, 110 ఏళ్లుంటే ఎనిమిది నుంచి 18 ఏళ్లలోపు పిల్లలను దత్తత ఇస్తారు. ఈ నేపథ్యంలో నకిలీ సర్టిఫికెట్లు తీసుకొని దందాకు తెరలేపారు. ఇలా చేసి పిల్లల జీవితాల్ని ఇరకాటంలోకి నెడుతున్నారు. ఎందుకంటే పిల్లలు పదో తరగతి చదువుకునే సమయంలో తల్లిదండ్రులు వృద్ధాప్య దశలోకి రావడం.. పిల్లల భవిష్యత్‌పై ప్రభావం చూపుతోంది.

**వరంగల్ కేంద్రంగా...**

వరంగల్ జిల్లా కేంద్రంగా 2022లో దత్తత కోసం దరఖాస్తు చేసుకున్న దంపతులిచ్చిన పత్రాల్లో ఈ నకిలీల బాగోతం బయటకు వచ్చింది. గత నెలలో రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ విభాగ ఉన్నతాధికారి దత్తతకు సంబంధించి హోంస్టడీ రిపోర్టులను సమీక్షించాలని చెప్పడం, దరఖాస్తు చేసుకున్నవారు రెన్యూవల్‌కు వచ్చిన సందర్భంలో నకిలీ సర్టిఫికెట్ల అంశం అధికారుల దృష్టికి వచ్చింది. అయినా చర్యలు లేకపోవడం అనుమానాలకు తావిస్తోంది. వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసిన సర్టిఫికెట్ల దర్యాప్తునకు ఆదేశిస్తే వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశముంది.


Duplicate
Record Sheet
Vivekananda Public School
Head Master
STUDY, CONDUCT & DATE OF BIRTH CERTIFICATE
Admission Incharge
Head Master & Correspondent

**నర్సంపేట నుంచే నకిలీ సర్టిఫికెట్లు**

వరంగల్ జిల్లాలోని నర్సంపేట కేంద్రంగా శ్రీఅరుణోదయ విద్యాలయం, అరుణోదయ విద్యాలయం, ఏకశిల హైస్కూల్ పేర్లతో రెండు దశాబ్దాల క్రితం ఒకటి, రెండు, మూడో తరగతి చదువుకున్నారంటూ కొందరు పిల్లలు లేని దంపతులకు నకిలీ డేట్ ఆఫ్ బర్త్ సర్టిఫికెట్లు ఇచ్చారన్న ఆరోపణలున్నాయి. పిల్లలు లేని భార్యాభర్తలిద్దరూ చదువుకోకపోయినా, ఒకటే పాఠశాలలో చదివినట్టుగా సరిఫ్టికెట్ ఇవ్వడం, ఇద్దరూ వేర్వేరు ప్రాంతాలకు చెందినవారైనా, రెండు దశాబ్దాల క్రితం ఒకటే పాఠశాలలో చదివినట్టుగా ఇవ్వడం వివాదాస్పదమవుతోంది. అసలు వారు చదువుకున్న సమయంలో ఆ పాఠశాలలు లేకపోవడం గమనార్హం. పర్వతగిరి మండలం చింతనెక్కొండలోని వివేకానంద పబ్లిక్ స్కూల్‌లో ఒకరు చదవుకున్నా చదివినట్టుగా పాఠశాల పేరుతో నకిలీ స్కూల్ రికార్డు షీట్ తీసుకున్నారని ఆ పాఠశాల నిర్వాహకుడు బి.సాంబయ్య లిఖితపూర్వక ఫిర్యాదు ఇచ్చారు. దత్తతకు వచ్చిన చాలామంది దంపతులు నర్సంపేటలోని పాఠశాలల నుంచే ఈ సర్టిఫికెట్లు తేవడంతో దీని వెనుక బడా నకిలీ సర్టిఫికెట్ల రాకెట్ ఉందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇతర జిల్లాలకు చెందిన వారు సైతం ఇక్కడే చదువుకున్నట్టుగా సర్టిఫికెట్లు తీసుకెళ్లారన్న ఆరోపణలు కూడా ఉన్నాయి.

## తెలంగాణలో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రులు మార్పు

హైదరాబాద్

రాష్ట్రంలో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రులను తెలంగాణ ప్రభుత్వం మార్పు చేసింది. ఈ మేరకు సీఎస్ కె.రామకృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు. ఇన్‌ఛార్జి మంత్రులు ఆయా జిల్లాల్లోని ప్రజాపాలనా కార్యక్రమాల అమలును సమీక్షిస్తారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

మహబూబ్‌నగర్ – దామోద రాజనర్సింహ
రంగారెడ్డి – దుద్దిళ్ల శ్రీధర్‌బాబు
వరంగల్ – పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి
హైదరాబాద్ – పొన్నం ప్రభాకర్
నిజామాబాద్ – సీతక్క
కరీంనగర్ – తుమ్మల నాగేశ్వరరావు
ఆదిలాబాద్ – జూపల్లి కృష్ణారావు
మెదక్ – వివేక్ వెంకటస్వామి
నల్గొండ– అడ్లూరి లక్ష్మణ్ కుమార్
ఖమ్మం – వాకిటి శ్రీహరి

## నియామక ప్రక్రియలపై నమ్మకం పెంపొందాలి



-మొదటిపేజీ తరువాయి

వివిధ కేసుల్లో న్యాయస్థానాలు ఇచ్చిన తీర్పులతో యూపీఎస్సీ డేటాబేస్ రూపొందించిందని, రాష్ట్రాలు దాన్ని వినియోగించుకోవాలని సూచించారు. గురువారమిక్కడ నల్సార్ యూనివర్సిటీలో టీజీపీఎస్సీ, యూనివర్సిటీ సంయుక్తంగా 'పీఎస్సీలకు ఎదురవుతున్న న్యాయవివాదాలు, పరిష్కారం' అనే అంశంపై నిర్వహించిన రెండు రోజుల జాతీయ సదస్సును యూపీఎస్సీ ఛైర్మన్ అజయ్‌కుమార్, టీజీపీఎస్సీ ఛైర్మన్ బుర్రావెంకటేశం, నల్సార్ వర్సిటీ వీసీ ప్రొఫెసర్ శ్రీకృష్ణదేవరావుతో కలిసి ఐటీ శాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా అజయ్‌కుమార్ మాట్లాడుతూ, నియామక ప్రక్రియల్లో అయోమయం, అనుమానాలకు తావులేకుండా పీఎస్సీలు స్పష్టమైన సమాచారాన్ని ఉద్యోగార్థులకు అందించాలని సూచించారు. 'సరైన సమాచారం ఇవ్వకుంటే ప్రజల్లోకి అవాస్తవాలు వెళ్తాయి. దీంతో ఆందోళన, వ్యతిరేకత మొదలవుతుంది. స్పష్టమైన సమాచారాన్ని అందించడం ద్వారా ఈ సమస్య నుంచి గట్టెక్కవచ్చు. ఉద్యోగార్థులు ఎదుర్కొనే సమస్యలకు ఏఐ చాట్‌బాక్స్ ద్వారా సమాధానాలు ఇవ్వవచ్చు. కొన్ని వివాదాల్లో న్యాయస్థానాలు ఇచ్చే తీర్పులు, తీసుకునే నిర్ణయాలను విశ్లేషించుకుంటూ ఆ మేరకు సంస్కరణలు తీసుకురావాలి. ఒకేరకమైన కేసులు పదేపదే వస్తుంటే.. విధానపరమైన నిర్ణయాలతో పరిష్కారానికి చర్యలు చేపట్టాలి'అని అజయ్‌కుమార్ నిర్దేశించారు. సదస్సులో తెలంగాణ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ పి.నవీన్‌రావు, ఏపీపీఎస్సీ ఛైర్‌పర్సన్ ఎ.ఆర్.అనురాధ, వివిధ రాష్ట్రాల పీఎస్సీల ఛైర్మన్లు, సభ్యులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

## పిడుగుపాటుకు ఆరుగురు మృతి

**ఆదిలాబాద్ జిల్లాలో మూడుచోట్ల ఘటనలు**

**అందరూ ఆదివాసీలే..మృతుల్లో ఐదుగురు మహిళలు,ఒక పురుషుడు**



ఆదిలాబాద్

మూడుచోట్ల పిడుగులు పడి ఆదిలాబాద్ జిల్లాలో ఆరుగురు మృతి చెందారు. మృతుల్లో ఐదుగురు మహిళలు, ఒక పురుషుడు ఉన్నారు. వీరంతా ఆదివాసీలే. గాదిగూడ మండలం పిప్పిరి గ్రామానికి చెందిన రైతు పెందూర్ మాధవరావు తన కుటుంబసభ్యులు, 14 మంది కూలీలతో కలిసి చేనులో గురువారం మొక్కజొన్న విత్తనాలు విత్తుతున్నారు. మధ్యాహ్న భోజన సమయం తర్వాత మళ్లీ అదేపనిలో నిమగ్నమయ్యారు. ఈ సమయంలోనే ఒక్కసారిగా వర్షం పడింది. దీంతో వారంతా సమీపంలోని ఓ పందిరి కిందకు చేరారు. అక్కడే ఓ టేకు చెట్టు ఉంది. మధ్యాహ్నం 2 గంటల ప్రాంతంలో ఒక్కసారిగా చెట్టుపై పిడుగు పడింది. దీంతో దానికి దగ్గరలోనే ఉన్న పెందూర్ మాధవరావు(45), ఆయన కూతురు పెందూర్ సుజాత(16), సిడం రంభబాయి(40), మంగం భీమ్‌బాయి (45) అక్కడికక్కడే మృతిచెందారు. మాధవరావు భార్య, ఇద్దరు కుమారులు, బంధువులు 10 మంది గాయపడ్డారు. వీరిని సమీపంలోని పీహెచ్‌సీలకు, మరికొందరిని మెరుగైన చికిత్స కోసం ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు. బేల మండల పరిధిలోని సాంగిడి గ్రామంలో పత్తి విత్తనాలు వేస్తుండగా పిడుగు పడి గెడం నందిని(30), సోన్‌కాస్ గ్రామంలో పొలం పనులు చేస్తుండగా కోవ సునీత(40) అక్కడికక్కడే మృతిచెందారు. ఉట్నూర్ మండలం కుమ్మరితండాకు చెందిన ధర్మరాజు, కృష్ణబాయి, నిర్మల చేను పనులకు వెళ్లారు. మధ్యాహ్నం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది.చేను సమీపంలోని చెట్టుపై పిడుగు పడడంతో ముగ్గురూ గాయపడ్డారు. వీరిని ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు.

# అల్బినిజంపై అవగాహన ఆవశ్యకత

ప్రతి సంవత్సరం జూన్ 13న అంతర్జాతీయ అల్బినిజం అవగాహనా దినోత్సవాన్ని ప్రపంచ వ్యాప్తంగా జరుపుకుంటారు. అల్బినిజం అనే అరుదైన జన్యుపరమైన వైకల్యంపై ప్రజల్లో అవగాహన పెంపొందించడమే ఈ దినోత్సవం యొక్క ప్రధాన ఉద్దేశ్యం. ఈ రుగ్మత కారణంగా బాధపడుతున్న వ్యక్తులు ప్రపంచ వ్యాప్తంగా వివిధ రకాల ఆరోగ్య, సామాజిక, మానసిక సవాళ్లను ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యల పట్ల ప్రపంచ సమాజం గళమెత్తి, అల్బినిజం ఉన్నవారికి హక్కులు, గౌరవం, రక్షణ లభించేలా కృషి చేయాల్సిన అవసరం ఎంతో ఉంది. అల్బినిజం అనేది శరీరంలో మెలనిన్ అనే వర్ణ ద్రవ్యం తక్కువగా ఉత్పత్తి కావడం వల్ల కలిగే స్థితి. మెలనిన్ చర్మానికి, కళ్ళకు, వెంట్రుకలకు రంగును ఇచ్చే పదార్థం. దీనిలో లోపం వలన బాధితుల చర్మం తెలుపుగా, జుట్టు పసుపు లేదా తెల్లగా, కళ్ళు నీలం లేదా గులాబీ రంగులో కనిపిస్తాయి. ఈ వ్యాధి కేవలం శారీరకంగా కాకుండా, భావోద్వేగ మరియు సామాజికంగా తీవ్రమైన ప్రభావాలను చూపుతుంది. అల్బినిజం అనేది ఒకే విధంగా ఉండదు. ఇందులో అనేక రకాలు ఉన్నాయి. ముఖ్యంగా ఆక్యులోక్యూటేనియస్ అల్బినిజం అత్యంత సాధారణ రకం. ఇది చర్మం, కళ్ళు, వెంట్రుకలను ప్రభావితం చేస్తుంది. ఆక్యులర్ అల్బినిజం అనే రకం ప్రధానంగా కళ్లను మాత్రమే ప్రభావితం చేస్తుంది. ఇది ఒక వైరుధ్యమయమైన నిజం –అల్బినిజంతో బాధపడేవారికి, సమాజంలో వారి ప్రత్యేక స్వభావం వల్ల మానసికంగా తీవ్ర ఒత్తిడులు ఎదురవుతున్నాయి. చర్మం తెల్లగా ఉండటం వల్ల వారు ఇతరులకంటే భిన్నంగా కనిపించడం వల్ల బాల్యం నుంచే వారికి వివక్ష, తక్కువ చూపు, హింస ఎదురవుతుంది. ముఖ్యంగా ఆఫ్రికా ఖండంలోని కొన్ని దేశాల్లో ఈ స్థితి మూఢనమ్మకాలకు గురై హింసాత్మకంగా మారింది. అక్కడ అల్బినిజం ఉన్నవారి శరీర భాగాలను తంత్ర శక్తుల కోసం వాడతారని నమ్మకం ఉంది. వీటిని అరికట్టడం కోసం ఐక్యరాజ్య సమితి 2013లో ప్రత్యేకంగా చర్యలు చేపట్టి, 2015లో జూన్ 13ను అంతర్జాతీయ అల్బినిజం అవగాహనా దినంగా ప్రకటించింది. అల్బినిజం ఉన్నవారు అనేక ఆరోగ్య సమస్యలతో బాధ పడుతుంటారు. ముఖ్యంగా కంటి సమస్యలు – అస్టిగ్మాటిజం, నిస్టాగ్మస్, దృష్టి లోపం, కాంతి పట్ల అధిక స్పందన – ఎక్కువగా కనిపిస్తాయి. వీరు సూర్య



కిరణాలకు మరింత సున్నితంగా ఉంటారు, దీంతో సన్‌బర్న్, చర్మ క్యాన్సర్ వంటి ప్రమాదాలు ఎక్కువ. వీటికి తోడు, వారు ఎదుర్కొనే మానసిక ఒత్తిడి, తక్కువ ఆత్మవిశ్వాసం, సమాజానికి దూరంగా ఉండే మానసిక స్థితి మరింత బాధాకరం. ప్రపంచంలో సగటుగా ప్రతి 17,000 నుంచి 20,000 మందిలో ఒకరికి అల్బినిజం ఉంటుంది. అయితే టాంజానియా వంటి దేశాల్లో ఇది మరింత అధికంగా ఉంది – సుమారు 1:1,400 జనాభాలో ఒకరికి ఇది ఉంటుంది. అల్బినిజంతో బాధపడే వారిపై హింసాత్మక దాడులు జరిగే అధికశాతం కేసులు ఆఫ్రికా ఖండంలోనే నమోదవుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల దృష్ట్యా, ఈ దినోత్సవం ద్వారా తీసుకోవాల్సిన ముఖ్యమైన చర్యలు: అల్బినిజంపై సరైన అవగాహన కల్పించాలి. వారి ఆరోగ్యాన్ని కాపాడేందుకు ఉచిత సన్‌స్క్రీన్, కళ్లద్దాలు, వైద్య సేవలు అందుబాటులో ఉంచాలి. విద్యా రంగంలో ప్రత్యేక శిక్షణా పద్ధతులు, దృష్టి ఆధారిత ఉపకరణాలు అందించాలి. చట్టపరంగా వారి హక్కులను నిర్ధారించాలి. సమాజంలో సమానత్వం, గౌరవం కల్పించే విధంగా చైతన్యం కల్పించాలి. ఇది ఒక రోజు వేదిక మాత్రమే కాదు – ఇది ప్రతి ఒక్కరికి బాధితుల బాధను అర్థం చేసుకునే, మార్పు కోసం ముందడుగు వేయాల్సిన రోజు. అల్బినిజం ఉన్న వారు మానవాళిలో భాగమే. వాళ్లు కూడా సమాజంలో గౌరవంతో, భద్రతతో జీవించ గలగాలి. మనం అందరం కలిసి – అవగాహన, ఆమోదం, సహానుభూతి ద్వారా – ఒక సమానతాభిమాన సమాజాన్ని నిర్మించాలి. తెలుపు రంగు లోపం కాదు.. అది ప్రత్యేకత. ఆ ప్రత్యేకతను గౌరవించడమే మన బాధ్యత.

# గతతరాల వారసత్వం కుట్టుమిషన్

ప్రపంచాన్ని శ్రమతో అలంకరించిన అనేక ఆవిష్కరణలలో కుట్టు యంత్రం ఒక గొప్ప మానవ ప్రయత్నానికి చిరుగుర్తుగా నిలిచింది. ప్రతి సంవత్సరం జూన్ 13న జరుపుకునే జాతీయ కుట్టు యంత్రం దినోత్సవం ఈ పరికరం పట్ల మన కృతజ్ఞతను వ్యక్తపరచే ఒక ముఖ్యమైన సందర్భం. ఇది కేవలం ఒక యంత్రం మాత్రమే కాదు, ఒక విప్లవాత్మక మార్పు ప్రతీక. మానవ చరిత్రలో చేతివృత్తుల ప్రాధాన్యం తగ్గిపోకుండా, తక్కువ సమయంలో ఎక్కువ పని చేసే సామర్థ్యాన్ని కలిగిన కుట్టు యంత్రం సామాజిక, ఆర్థిక, సాంకేతిక రంగాలలో గొప్ప పునర్నిర్మాణానికి నాంది పలికింది. కుట్టు యంత్రం చరిత్ర 18వ శతాబ్దానికి చెందింది. 1790లో థామస్ సెయింట్ అనే ఇంగ్లండ్‌కు చెందిన వ్యక్తి తొలిసారిగా కుట్టు యంత్రానికి పేటెంట్ దాఖలు చేశాడు. 1846లో ఎలియాస్ హవ్ అభివృద్ధిపరిచిన లాక్‌స్టిచ్ యంత్రానికి పేటెంట్ దక్కగా, 1851లో ఐజాక్ సింగర్ రూపొందించిన వినియోగ–అనుకూల మోడల్ యంత్రం వాణిజ్యంగా విస్తరించి ప్రపంచాన్ని ఆకర్షించింది. 1860 నాటికి అమెరికాలోనే దాదాపు 20 లక్షల యంత్రాలు అమ్ముడయ్యాయి. ప్రపంచ వ్యాప్తంగా చూస్తే, 2023 నాటికి కుట్టు యంత్రాల మార్కెట్ విలువ రూ. 72,000 కోట్ల (9 బిలియన్ డాలర్లు)కు పైగా ఉంది. ఇందులో భారతదేశ వాటా దాదాపు 12 శాతం. ఇండియన్ సెయింగ్ మిషన్ మార్కెట్ 2024 నాటికి రూ. 8,000 కోట్ల విలువ దాటిందని ఫిక్కీ నివేదిక చెబుతోంది. భారతదేశంలో టెక్స్‌టైల్ అండ్ అపారెల్ రంగం అత్యంత ఉపాధి కలిగించే రంగాలలో ఒకటి. భారత్?లో సుమారు 4.5 కోట్ల మంది టెక్స్‌టైల్ రంగంలో నేరుగా పని చేస్తుండగా, వీరిలో కనీసం 80 లక్షలమంది కుట్టు, అల్లిక, ఎంబ్రాయిడరీ తదితర చిన్న పరిశ్రమలతో జీవిస్తున్నారు. జాతీయ సాంపిల్ సర్వే సంస్థ 2019 నివేదిక



ప్రకారం, ఈ రంగంలో 65 శాతం మంది మహిళలే. అహ్మదాబాద్, లక్నో, కాన్ పూర్, తిరుప్పూర్, ఎరోడ్, బెంగళూరు, సూరత్ వంటి నగరాలు శ్రమ ఆధారిత గార్మెంట్స్ కేంద్రాలుగా నిలిచాయి.తెలంగాణ రాష్ట్రంలో పరిశ్రమల శాఖ గణాంకాల ప్రకారం, రాష్ట్ర వ్యాప్తంగా 2023 నాటికి సుమారు 1.2 లక్షల మంది చిన్న టైలరింగ్, కుట్టు పనుల ద్వారా ఉపాధి పొందుతున్నారు. హైదరాబాద్, వరంగల్, కరీంనగర్, నల్గొండ ప్రాంతాల్లో మహిళల ఆధ్వర్యంలో నడిచే సూచి పరిశ్రమలు, స్వయం ఉపాధి కేంద్రాలు అభివృద్ధి చెందుతున్నాయి. ముఖ్యంగా మిషన్ భగీరథతోపాటు మిషన్ కాకతీయ పరిధిలో మహిళా సంఘాల ద్వారా ఉషా ఇంజనీరింగ్, సింగర్ సంస్థల సహకారంతో పలు కుట్టు శిక్షణ కేంద్రాలు ఏర్పాటు అయ్యాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సహకారంతో వైఎస్సార్ విద్యా కానుక, జగన్న వసతి దీవెన పథకాల క్రింద స్కూల్ యూనిఫాం తయారీకి వేలాది మంది మహిళలు గృహస్థాయిలో పని చేస్తున్నారు. విశాఖపట్నం, కర్నూలు, తెనాలి, చిత్తూరు వంటి ప్రాంతాల్లో సుమారు 60,000 మంది పైగా మహిళలు కుట్టు ఆధారిత ఉపాధితో జీవిస్తున్నట్లు రాష్ట్ర పరిశ్రమల శాఖ గణాంకాలు సూచిస్తున్నా యి. ఆధునిక యుగంలో మానవ కృషికి తోడుగా యాంత్రిక పరిజ్ఞానం కుదిరినట్లు, కుట్టు యంత్రాల తయారీలోనూ నూతన మార్గాలు రూఢమవుతున్నాయి. కంప్యూటరైజ్డ్ ఎంబ్రాయిడరీ యంత్రాలు, ఆటోమేటిక్ స్టిచింగ్ మోడల్స్, డిజిటల్ ఫ్యాబ్రిక్ కట్టింగ్ సిస్టమ్స్ రూపుదిద్దుకుంటున్నాయి. 2023లో భారత్‌లో మాత్రమే డొమెస్టిక్ గృహ వినియోగ కుట్టు యంత్రాల అమ్మకాలు దాదాపు 12 లక్షల యూనిట్లకు చేరుకున్నాయి, అందులో 40% ఉషా, 25% సింగర్, 15% బ్రదర్ బ్రాండ్లు మార్కెట్‌ను ఆక్రమించాయి.కుట్టు యంత్రం ఒక పరికరం మాత్రమే కాదు. అది మన కుటుంబాల్లో గత తరం వారసత్వానికి గుర్తు. నానమ్మ చేతుల బరువు, అమ్మ శ్రమలోని ప్రేమ, తమ సొంత దుస్తులను కుట్టుకునే క్షణాల్లోని ఆత్మగౌరవం ు ఇవన్నీ కుట్టు యంత్రంలో లీనమై ఉంటాయి. ఇది ఒక సాధనమే అయినా, జీవన వేదికను రూపొందించగల సామర్థ్యం కలిగిన శక్తి. జాతీయ కుట్టు యంత్రం దినోత్సవం మనం రోజూ చూసే కానీ గుర్తించని ఓ సాధనాన్ని గౌరవించేదిగా మారాలి. ఈ రోజు మనందరం మన కుట్టు యంత్రాలను పరిశుభ్రం చేసి, ఒక చిన్న పనితనం చేయడం ద్వారా మన సృష్టిశక్తికి గౌరవం తెలపవచ్చు. ఎందుకంటే అది కేవలం బట్టలు కుట్టే యంత్రం కాదు ు అది జీవితాన్ని కుట్టే మేధో సాధనం.

# అజాగ్రత్తే అగ్నిప్రమాదాలకు కారణం


అగ్ని వలన జరిగే ప్రమాదాలను అగ్ని ప్రమాదాలు అంటారు. ఇవి వేడి ఎక్కువగా ఉండే వేసవి కాలంలో ఎక్కువగా జరుగు తాయి. ఈ ప్రమాదాల వలన ఎంతో ప్రాణ నష్టం, ఆస్తి నష్టం సంభవిస్తుంది. పాదచారులు, గుర్తు తెలియని వ్యక్తులు బీడీలు, సిగరెట్లు తాగి వాటిని ఆర్పకుండా అలాగే పారేస్తుండటంతో అవి అంటుకొని మంటలు పాకి ప్రమాద ఘటనలు తరచుగా జరుగుతున్నాయి. అగ్నిమాపక శాఖను కేవలం అగ్నిప్రమాదాలకే పరిమితం కాకుండా ప్రకృతి వైపరీత్యాలు, రోడ్డు, రైలు ప్రమాదాలు, వానలు, వరదలు, భూకంపాలు... ఇతర ప్రాణాపాయ పరిస్థితులు ప్రజలకు ఏర్ప డినప్పుడు విపత్తుల శాఖ అధికారులు వెంటనే రంగంలోకి దిగుతారు. బాధితులు, ఆర్తులకు అవసరమైన సేవలు అందించడం ద్వారా ప్రాణ, ఆస్తి నష్టాన్ని సాధ్యమైనంత తగ్గించడానికి ప్రయత్నిస్తారు. 101 నెంబరుకు ఫోన్ చేస్తే శాఖాపరంగా బాధితులకు అవసరమైన సేవలు అందిస్తారు. అగ్ని ప్రమాదం సమయంలో ప్రతి క్షణం విలువైనది. వీలైనంత మేరకు అగ్నిమాపక శాఖకు సమాచారం అందించ గలిగితే, ఎక్కువ నష్టం కలుగకుండా నివారించ వచ్చు. ఆస్తి, ప్రాణనష్టం లేకుండా చూడవచ్చు. అగ్ని ప్రమాదం జరిగిన వెంటనే 101కు ఫోన్ చేసి వివరాలను తెలియ చేయాలి. ప్రమాద సంఘటన గురించి వివరించాలి. విద్యుదాఘాతం, ఎండ వేడిమి ప్రమాదాలకు కారణాల వుతున్నా, ప్రకృతి వైపరీత్యాల వల్ల సంభవించే బీభత్సాలను పక్కన పెడితే మనిషి అజాగ్రత్త వల్ల జరిగే అగ్నిప్రమాదాలే ఎక్కువ జరుగుతు న్నాయి. ఎండా కాలంలో ఏమాత్రం అజాగ్రత్తగా వ్యవహరిం చినా పెద్దపెద్ద అగ్నిప్రమాదాలు జరిగే ఆస్కారముంది. ముందు జాగ్రత్తగా కొన్ని నియమాలను పాటిస్తే వాటిని అరికట్ట వచ్చు. రద్దీ ఎక్కువగా ఉండే ప్రదేశాల్లో ప్రమాదాలు సంభవించిన ప్పుడు కంగారు, అయోమ యానికి గురికా కుండ ఉండాలి. గందరగోళం తొక్కిసలాటకు దారితీసి, అగ్ని ప్రమాదం కన్నా పెద్ద దుర్ఘటనకు కారణం కావొచ్చు. ఆసుప త్రులు, హోటళ్ళు, షాపింగ్ కాంప్లెక్సుల చుట్టు ఫైర్ ఇంజన్ తిరిగేందుకు వీలుగా అవసరమైన ఖాళీ స్థలం ఉండాలి. భవనాలు చుట్టూ, ముందు భాగంలో గాలి వెలుతురు వచ్చే కిటికీలు ఏర్పాటు చేయాలి. భవనాలు ముందు పెద్ద సైజ్ హోర్డింగ్‌లు ఏర్పాటు చేయకూడదు. అధిక నీటి సామర్థ్యం గల ట్యాంకులను అమ ర్చుకోవాలి. నీళ్ళు తోడటానికి అనువుగా మోటార్‌ను అమర్చా లి. భవనాలకు ఒకే స్టైయిర్ కేసు కాకుండా అత్యవసర సందర్భాల్లో ఉపయోగించ టానికి మరో స్టైయిర్‌కేస్ సమకూర్చు కోవాలి. ఎమర్జెన్సీలో విద్యుత్ సరఫరా నిలిచిపోయేలా సర్క్యూట్ బ్రేకర్లు అమర్చుకోవాలి. విద్యా సంస్థలు, ఫ్యాక్టరీలు, ఆసుపత్రులు, సినిమా హాళ్లు తదితర వాటిల్లో కచ్చితంగా అగ్ని ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి. ఇళ్లల్లో వంట గ్యాస్‌కనెక్షన్లు, వాటి ఫిట్టింగులు సరిగ్గా ఉన్నాయా లేదా ఎప్పటికప్పుడు సరిచూసు కోవాలి. స్టౌ మండుతున్న సమయంలో జాగ్రత్త అవసరం. మండుతున్న పొయ్యికి దూరంగా ఉండి వస్తువులను ఉపయో గించాలి. అగ్గిపెట్టెలు, లైటర్లు, కిరోసిన దీపాలను దూరంగా ఉంచాలి. కాగితం వంటి మండే పదార్థం , వస్త్రం, కలప, పెయింట్స్, ఎల్పిజి సిలిండర్లు, ప్లాస్టిక్ సాధారణంగా భవనాలలో నిల్వ చేయ బడతాయి. ఇది ఎక్కువ ప్రమాదాన్ని కలిగిస్తుంది. ప్రధానంగా దీపావళి సందర్భంగా బాణాసంచా కాల్చడం వల్ల సామాన్యంగా అగ్ని ప్రమాదాలు జరుగుతాయి. వీటి పట్ల పిల్లలకు అవగాహన కల్పించాలి. అగ్ని ప్రమాదం సంభించినపుడు ఇంటి తలుపులు మూసి పొరుగు వారిని పిలవాలి. ప్రమాదం జరగగానే అగ్నిమాపక కేంద్రానికి సమాచార మందించాలి. అగ్ని ప్రమాదం జరిగినపుడు కంగారు పడక, జాగ్రత్తగా వ్యవహరించాలి. దుస్తులకు నిప్పంటు కున్నప్పుడు పరుగెత్తడానికి ప్రయత్నించక, నేలమీద పడుకుని దుప్పటి లేదా రగ్గు శరీరం మొత్తం చుట్టుకుని పొర్లటం వల్ల మంటలను అర్పు కోవాలి. ఒళ్లు కాలి గాయమైతే వదులుగా ఉండే దుస్తులను ధరించి వైద్యుడి దగ్గరకెళ్లి చికిత్స చేయించుకోవాలి.

# పదకొండేళ్లలో ఆర్థిక పతనం

ప్రధాని మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 11 సంవత్సరాలు అయింది. ఆయన పాలన ప్రైవేటీకరణ, సరళీకరణ, ప్రపంచీకరణ ఆర్థిక విధానాల చుట్టూ కొనసాగుతూ ఉంది. రక్షణ, రైల్వేలతో సహా అనేక రంగాల్లో ఎక్కువ విదేశీ పెట్టుబడులను అనుమతించడానికి మోడీ ప్రభుత్వం భారతదేశ విదేశీ పెట్టుబడి విధానాలను సరళీకరించింది. దేశ, విదేశీ బడా పెట్టుబడిదారుల ప్రయోజనాలకు అనుకూలంగా దేశఆర్థిక విధానాలు అమలు చేస్తున్నది. ఫలితంగా దేశంలో ఆర్థిక అసమానతలు, నిరుద్యోగం, ఉపాధి సమస్య తీవ్రంగా ఉంది. భారతదేశాన్ని ప్రపంచ తయారీ కేంద్రంగా మార్చేందుకంటూ దేశ, విదేశీ కంపెనీలు దేశంలో ఉత్పత్తులు తయారు చేయటాన్ని ప్రోత్సహించడానికి 2014 సెప్టెంబర్‌లో మోడీ ప్రభుత్వం 'మేక్ ఇన్ ఇండియా' ప్రవేశ పెట్టింది. దీని ద్వారా విదేశీ కార్పొరేట్ సంస్థలు భారత మార్కెట్‌లో ఎక్కువ వాటాను స్వాధీనం చేసుకోవటానికి వీలు కల్పించింది. 'మేక్ ఇన్ ఇండియా' (%మీుఎవ ఊఅ ×అఎఋ%) లక్ష్యం తయారీ రంగం వృద్ధి రేటుని సంవత్సరానికి 12.14% పెంచటం, 2022 నాటికి జిడిపికి తయారీ రంగం వాటాను 25% పెంచటం. (తర్వాత దీన్ని 2025కి సవరించారు) 2022 నాటికి ఆర్థిక వ్యవస్థలో 100 మిలియన్ల అదనపు తయారీ ఉద్యోగాలు సృష్టించటం. వీటిని సాధించడంలో మోడీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. 2022 నాటికి జిడిపి తయారీ రంగం వాటా 25 శాతానికి చేరుకుంటుందని అంచనా వేయగా, 2013–14లో 16.7% ఉండగా, 2023- 24 నాటికి 15.9 శాతానికి జిడిపి పడిపోయింది. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పించకపోగా, ప్రభుత్వ రంగ సంస్థల్లోని లక్షలాది ఉద్యోగాలు తొలగించారు. భారతదేశ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి చెందినట్లు మోడీ ప్రభుత్వం ప్రచారం చేస్తున్నది. ఆర్థిక వ్యత్యాసాల్లోనూ, అప్పులు చేయడంలోనూ, ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మడంలోనూ, పేదరికంలోనూ, ఉద్యోగాలు కల్పించకపోవటంలోను మోడీ ప్రభుత్వం సాధించిన అభివృద్ధి మాత్రం వాస్తవం. నరేంద్ర మోడీ ప్రభుత్వం అమలు జరుపుతున్న ఆర్థిక విధానాలు కేవలం శత కోటీశ్వర్లకు మేలు చేయగా, పేదలకు తీవ్ర సమస్యలు సృష్టించింది. 2015లో భారత్ లో శత కోటీశ్వర్లు 97 మంది ఉండగా, ప్రస్తుతం వారి సంఖ్య 210 కి చేరింది. దీన్ని గమనిస్తే దేశ సంపద పేదల దరి చేరలేదనేది సుస్పష్టం. ఒక శాతం భారత జనాభా వద్ద 40 శాతం సంపద ఉంటే, 50 శాతం ఉన్న పేద వర్గాల వద్ద కేవలం 3 శాతం సంపద ఉంది. మోడీ ఆర్థిక విధానాలు పేదలను పేదలుగానే ఉంచింది. 2011 నుంచి ప్రభుత్వం పేదరికం, ఉపాధిపై అధికార డేటా ప్రకటించక పోవటంతో భారత ఆర్థిక పరిస్థితులను అంచనా వేయటం సాధ్యం కావటం లేదు. భారత ప్రభుత్వ గణాంక సంస్థ పేదరికం, ఉపాధిపై నిర్వహించే సర్వేలు నమ్మదగినవి కావని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.2014లో మోడీ అధికారంలోకి వచ్చే నాటికి దేశానికి రూ. 84 లక్షల కోట్ల అప్పు ఉంది. ఇందులో స్వదేశీ అప్పు రూ. 47.34 లక్షల కోట్లు కాగా, విదేశీ అప్పులు రూ. 37.4 లక్షల కోట్లు కాగా, 2025 నాటికి దేశం రూ. 224 లక్షల కోట్ల అప్పులకు చేరింది. ఇందులో స్వదేశీ అప్పులు రూ. 166.57 లక్షల కోట్లు కాగా, విదేశీ అప్పులు 57.4 లక్షల కోట్ల రూపాయలుగా ఉంది. మోడీ అధికారం చేపట్టిన తర్వాత అంతర్జాతీయ మార్కెట్‌లో మన రూపాయి విలువ బాగా దిగజారింది. మోడీ అధికారంలోకి వచ్చే నాటికి అంతర్జాతీయ మార్కెట్‌లో డాలర్‌కు రూపాయి విలువ 60 రూపాయలుగా ఉంటే, మోడీ పాలనలో ఇప్పుడు 86 రూపాయలుగా ఉంది. తాజా లెక్కల ప్రకారం ఆహార సూచికలో ప్రపంచంలోని 127 దేశాల్లో భారత దేశం 105 స్థానంలో ఉంది. మోడీ అధికారంలోకి వచ్చిన 10 సంవత్సరాల కాలంలో దేశ ఆకలి సూచిక స్కోరు 28.8 నుంచి 27.38కి మారింది. అదే కాలంలో పాకిస్తాన్‌లో స్కోర్ 29.8 నుండి 27.98 తగ్గింది. దేశ తలసరి ఆదాయంలో భారత్ 136వ స్థానంలో ఉండగా, అతిపేద దేశం శ్రీలంక 133వ స్థానంలో ఉంది. అంతర్జాతీయ ద్రవ్యనిధి ప్రకారం భారత ఆర్థిక వ్యవస్థ 2024లో 6.5%తో అభివృద్ధి చెందుతుందని అంచనా వేయబడింది. ఇది మరే ఇతర దేశాల ఆర్థిక వ్యవస్థల కన్నా ఎక్కువగా ప్రచారం చేయబడుతున్నది. అది వాస్తవం కాదు. 1987లో చైనా భారత ఆర్థిక ఆదాయం 0.27 ట్రిలియన్ల డాలర్లతో సమానంగా ఉన్నాయి. 2025 నాటికి భారత జిడిపి 4.19 ట్రిలియన్ డాలర్లు కాగా, చైనా జిడిపి 19.23 ట్రిలియన్ డాలర్లు. అంటే భారత్ కన్నా నాలుగు రెట్లు పైగా ఎక్కువ. ప్రస్తుతం చైనా తలసరి ఆదాయం 13,687 డాలర్లు కాగా, భారత తలసరి ఆదాయం 2,880 డాలర్లు మాత్రమే. పేదలకు ఈ ఆదాయం కూడా లేదు. దీన్ని గమనిస్తే భారత ఆర్థిక వ్యవస్థ పెరుగుదల వాస్తవ రూపంలో లేదని అర్థమవుతుంది. 11 సంవత్సరాల మోడీ ప్రభుత్వ పాలనలో ప్రభుత్వ రంగ సంస్థలను, ఆస్తులను పెద్ద ఎత్తున అమ్మకాలకు పెట్టారు. దీన్ని సమర్థించుకోవటానికి, ప్రభుత్వం వ్యాపారం చేయదని అది ప్రభుత్వ విధానం కాదని, ప్రభుత్వ సంస్థలను, ఆస్తులను అమ్మి ఆ డబ్బులను ప్రజాసంక్షేమానికి ఉపయోగిస్తామని చెప్పటంలో వంచన దాగి ఉంది. ప్రధాని మోడీ ఒక విషయాన్ని మభ్యపెట్టే ప్రయత్నం చేశారు. ప్రభుత్వ సంస్థలు, ఆస్తులు ప్రజా సంక్షేమం కోసం ఉన్నవే గాని లాభాల కోసం ఏర్పాటు చేసినవి కాదు. ప్రజా సంక్షేమం పట్టని మోడీ ప్రభుత్వం, ప్రభుత్వ సంస్థలను, ఆస్తులను బడా పెట్టుబడిదారులకు కారుచవకగా అమ్ముతున్నది. తొలి ఐదు సంవత్సరాల పాలనలో ప్రభుత్వ సంస్థల్లో పెట్టుబడుల ఉపసంహరణ, ప్రభుత్వ సంస్థల్లో వాటాల విక్రయం ద్వారా 3 లక్షల కోట్ల రూపాయలను మోడీ ప్రభుత్వం పొందింది. మలి విడత పాలనలో 1.5 లక్షల కోట్లను పొందింది. ఈ విధంగా ప్రభుత్వ రంగ సంస్థలను, ఆస్తులను ప్రైవేట్ సంస్థల పరం చేస్తున్నది. మొండి పారు బకాయిల పేరుతో బడా పారిశ్రామిక వేత్తలు బ్యాంకులకు చెల్లించాల్సిన దాదాపు రూ. 14 లక్షల కోట్ల అప్పులను రద్దు చేయడం మోడీ ప్రభుత్వ విధానాలకు అద్దం పడుతున్నది. మోడీ ప్రభుత్వ విధానాల ఫలితంగా వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభంలో ఉంది. దేశంలో పని చేసే జనాభాలో 60% దాక వ్యవసాయ రంగం మీద ఆధారపడి జీవిస్తున్నారు. 2022 నాటికి రైతుల ఆదాయం రెట్టింపు చేస్తానని చెప్పిన మోడీ అందుకు విరుద్ధంగా రైతాంగ వ్యతిరేక విధానాలు అమలు జరుపుతున్నారు. పంటలకు న్యాయమైన ధరలు ప్రకటించి వాటికి చట్టబద్ధత కల్పించటానికి వ్యతిరేకత వ్యక్తం చేస్తున్నారు. ఫలితంగా రైతులు తీవ్రంగా నష్ట పోతున్నారు. మూడు వ్యవసాయ చట్టాల ద్వారా పంటల కొనుగోళ్ల నుంచి తప్పుకున్నట్లు ప్రకటించింది. రైతుల ఆందోళనతో మూడు చట్టాలు రద్దు చేసినా, వాటిని దొడ్డిదారిన అమలు చేస్తున్నది. విత్తనాలు, ఎరువుల, పురుగుమందుల ధరలు అరికట్టలేకపోయింది. గ్రామీణ గణాంకాల శాఖ 2021- సెప్టెంబర్ -10న ప్రకటించిన శాంపిల్ సర్వే ప్రకారం చిన్న రైతులకు వ్యవసాయం ద్వారా రోజు వారీ లభించే సగటు ఆదాయం 27 రూపాయలు. నెలకు 816 రూపాయలు. వ్యవసాయ ఆదాయంతోపాటు ఇతర మార్గాల ద్వారా వచ్చే ఆదాయం కలుపుకుంటే కుటుంబ ఆదాయం కొంత పెరుగుతుంది. 2012 -13 లో కుటుంబాల సగటు అప్పు రూ. 47 వేలు కాగా, నేడు రూ. 80 వేలకు పైగా ఉంది. తెలుగు రాష్ట్రాల్లో రూ. 2 లక్షలకు పైగా ఈ అప్పు ఉంది. అప్పుల ఊబి నుంచి బయటపడలేక 4 లక్షల దాకా రైతులు బలవన్మరణాల పాలయ్యారు. మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న ఆర్థిక, రాజకీయ విధానాల వల్ల వ్యవసాయ, పారిశ్రామిక రంగాలు తీవ్ర సంక్షోభంలో ఉన్నాయి. గ్రామీణ, పట్టణ పేదలు, కార్మికులు ఉపాధికి దూరమవుతున్నారు. నిరుద్యోగం పెరుగుతూ ఉంటే, మరో పక్క సంపద కేంద్రీకరణ పెరిగింది. దేశం అప్పుల్లో కూరుకుపోయింది. మోడీ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా దేశ ప్రజల ఐక్యంగా ఉద్యమించాలి.

## బిజినెస్

### జీఆర్‌టీ నుంచి గోల్డెన్ ఎలెవెన్ ఫ్లెక్సీ ప్లాన్




ఆభరణాల రిటైలింగ్ దిగ్గజం జీఆర్‌టీ జువెలర్స్ తమ కస్టమర్ల కోసం గోల్డెన్ ఎలెవెన్ ఫ్లెక్సీ ప్లాన్‌ను ప్రారంభించింది. ఇది 11 నెలల పాటు బంగారంపై పెట్టుబడి పెట్టే ఆకర్షణీయమైన ప్లాన్. కనీస పెట్టుబడి రూ.1000. ఆ పైన ఎంత మొత్తంలో అయినా ఇన్వెస్ట్ చేయవచ్చు. వారు 11 నెలల అనంతరం తమకు ఇష్టమైన ఆభరణాలు కొనుగోలు చేయవచ్చునని జీఆర్‌టీ జువెలర్స్ ఒక ప్రకటనలో తెలిపింది. ఇందులో రెండు ఆప్షన్లుంటాయి. ఒకటి బరువు ఆధారిత ప్లాన్ కాగా రెండోది విలువ ఆధారిత ప్లాన్. ఈ రెండింటిలో ఏదో ఒకటి కస్టమర్ ఎంచుకోవచ్చు. 18 శాతం వరకు ఎలాంటి తరుగు వసూలు చేయకపోవడం ఈ ప్లాన్ ప్రత్యేకత. బంగారం, వజ్రాలు, ప్లాటినం, వెండి ఆభరణాలన్నింటికీ ఈ ప్లాన్ వర్తిస్తుంది. బంగారం ధరలు భారీ ఆటుపోట్లకు గురవుతున్న ప్రస్తుత వాతావరణంలో ఇది కస్టమర్ల సొమ్ముకు విలువ చేకూర్చే చక్కని ప్లాన్ అని కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ జీఆర్ 'ఆనంద్' అనంత పద్మనాభన్ అన్నారు. నెలవారీ వాయిదా ఎంపిక నుంచి ఎప్పటికప్పుడు చెల్లింపులకు సంబంధించిన అలర్ట్‌లు జారీ చేయడం వరకు అన్నింటిలోనూ తమ నిపుణులు కస్టమర్లకు మార్గదర్శకం చేస్తారని చెప్పారు. జన్మదినాలు, ఇతరత్రా వేడుకల సమయంలో కుటుంబ సభ్యులకు ఆకర్షణీయమైన బహుమతులు ప్లాన్ చేసేందుకు ఇది చక్కని అవకాశమని మేనేజింగ్ డైరెక్టర్ జీఆర్ రాధాకృష్ణన్ అన్నారు.

### మళ్లీ భారీగా పెరిగిన ధరలు..



బంగారం ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. రెండు నెలల క్రితం లక్ష రూపాయలను ఢీకొట్టిన బంగారం ధర ఆ తర్వాత మెల్లిగా తగ్గుతూ వచ్చింది. ఈ క్రమంలోనే.. గురువారం బంగారం ధర భారీగా పెరిగింది. బంగారం ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. రెండు నెలల క్రితం లక్ష రూపాయలను ఢీకొట్టిన బంగారం ధర ఆ తర్వాత మెల్లిగా తగ్గుతూ వచ్చింది. ఈ క్రమంలోనే.. గురువారం బంగారం ధర భారీగా పెరిగింది. 10 గ్రాముల స్వచ్ఛమైన బంగారం ధర లక్ష మార్కుకు చేరువైంది. దేశీయంగా 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర 99,280గా ఉంది. కిలో వెండి ధర ఒక లక్షా 9వేలు పలుకుతోంది. అయితే.. ప్రాంతాల వారీగా బంగారం ధరలు మారుతుంటాయి.. దేశంలోని ప్రధాన నగరాల్లో బంగారం ధరలు ఎలా ఉన్నాయో తెలుసుకోండి..హైదరాబాద్ లో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.880 పెరిగి రూ.99,280 కి చేరింది. ఇక 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.800 పెరిగి రూ.91,000 లుగా ఉంది. కేజీ వెండిపై రూ.100 తగ్గి రూ. 1,18,900గా ఉంది.విజయవాడ, విశాఖపట్నంలో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.880 పెరిగి రూ.99,280 కి చేరింది. ఇక 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.800 పెరిగి రూ.91,000 లుగా ఉంది. కేజీ వెండిపై రూ.100 తగ్గి రూ.1,18,900గా ఉంది.ముంబైలో 24 క్యారెట్ల బంగారం ధర రూ. 9,928, 22 క్యారెట్ల ధర 90,100 లుగా ఉంది. కిలో వెండి ధర రూ.1,08,900 లుగా ఉంది.ఢిల్లీలో 24 క్యారెట్ల గోల్డ్ ధర రూ.99,430, 22 క్యారెట్ల ధర 90,115గా ఉంది కిలో వెండి ధర రూ.1,08,900 లుగా ఉంది.చెన్నైలో 24 క్యారెట్ల గోల్డ్ ధర రూ.99,280, 22 క్యారెట్ల ధర 90,100గా ఉండగా.. కిలో వెండి ధర రూ.1,18,900 లుగా ఉంది.బెంగళూరులో 24 క్యారెట్ల పసిడి ధర రూ.99,280, 22 క్యారెట్ల ధర 90,100గా ఉండగా.. కిలో వెండి ధర రూ.1,08,900 లుగా ఉంది. వాస్తవానికి పసిడి, వెండికి ఎల్లప్పుడూ డిమాండే ఉంటుంది.. బులియన్ మార్కెట్‌లో బంగారం, వెండి ధరలు ఒక్కోసారి తగ్గితే.. మరికొన్ని సార్లు పెరుగుతూ వస్తుంటాయి.. అయితే.. ఇటీవల కాలంలో తగ్గినట్లే తగ్గి.. మళ్లీ బంగారం ధరలు భారీగా పెరగడంతో వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు.

# ఐఐటీ విద్యార్థులకు కొత్త కష్టం

## జాయినింగ్ రోజునే ప్లేస్‌మెంట్ ఆఫర్ రిజెక్ట్..!



ఇంజనీరింగ్ చదువుతున్న విద్యార్థులకు ప్లేస్‌మెంట్ ఆఫర్ అంటే ఎంతో గొప్ప విషయం. చదువు పూర్తికాక ముందే ఉద్యోగం పొందడం వారికి చాలా ఆనందాన్ని ఇస్తుంది. అయితే జాయినింగ్ తేదీనే ఆ ప్లేస్‌మెంట్ ఆఫర్ రివోక్ చేస్తున్నారని ముంబై ఐఐటీ విద్యార్థులు వాపోతున్నారు. ఉద్యోగం వచ్చిందనే ఆనందం లేకుండా పోతుందని బాధపడుతున్నారు. కొత్త ఉద్యోగ ఆఫర్లను స్వీకరించడం అనేది ఇంజనీరింగ్ విద్యార్థులకు కలగా ఉంటుంది. ఆఫర్ రాగానే తమ లైఫ్ సెట్ అయిపోయినట్లే అని భావిస్తూ ఉంటారు. ఫ్యామిలీతో పాటు ఫ్రెండ్స్‌కు ఈ విషయాన్ని చెప్పి ఆనందపడుతూ ఉంటారు. అయితే జాయినింగ్ రోజునే సారీ మీ ఆఫర్ రిజెక్ట్ చేశామని మెసేజ్ వస్తే ఆ విద్యార్థి పరిస్థితి ఎలా ఉంటుంది? ఇప్పటికే విషయాన్ని అందరికీ చెప్పిన తాను నలుగురిలో తల ఎలా ఎత్తుకోవాలో? అనే అవమాన భారంతో చాలా మంది కుమిలి పోతున్నారు. ఈ విషయాన్ని పక్కనపెడితే ఇప్పటికే ఉద్యోగం చేస్తున్న వారు మంచి భవిష్యత్ కోసం వన్ మంత్ నోటీస్ ఇచ్చి కొత్త ఉద్యోగంలో చేరుదామనుకుంటే ఈ రివోక్ లెటర్ మానసికంగా కుంగదిస్తుంది. ఐఐటీ బాంబే విద్యార్థి ప్రసాద్ చౌరే అనే విద్యార్థికి ఇలాంటి కష్టమే వచ్చింది. గత సంవత్సరం డిసెంబర్‌లో, క్యాంపస్ ప్లేస్‌మెంట్ సమయంలో చౌరేకు బిజినెస్ అనలిస్ట్‌గా ఆఫర్ వచ్చింది. అతని ఆన్‌బోర్డింగ్ పత్రాలను సేకరించిన కంపెనీ నుంచి అధికారిక ఆఫర్ లెటర్‌ను పొందడమే కాకుండా డ్యూయల్ ఎంప్లాయిమెంట్‌ను నిషేధిస్తూ ఒక ప్రకటనపై సంతకం చేశాడు. జూన్ 2న చేరడానికి కొన్ని రోజుల ముందు చౌరే తన ఆన్‌బోర్డింగ్ వాయిదా గురించి సందేశం అందుకున్నాడు. చేంజ్ ఇన్ రిక్వైర్‌మెంట్స్ ఫర్ ఫ్యూచర్ బిజినెస్ అని మెన్షన్ చేస్తూ అతడికి మెయిల్ వచ్చింది. దీంతో కంగుతినడం అతని వంతు అయ్యింది. కలల ఉద్యోగం గురించి అందరికీ చెప్పానని చివరకు ఇలా అయ్యిందని వాపోయాడు. తోటి లింక్డ్‌ఇన్ వినియోగదారులు కామెంట్స్‌లో విభాగానికి వెళ్లి చౌరేకు మద్దతు తెలిపారు. మరికొందరు చివరి క్షణంలో ఇలాంటి రద్దులు ఎలా సాధారణ పద్ధతిగా మారాయో? అని ఆందోళన వ్యక్తం చేశారు.

# యూఎస్ స్టాక్స్‌పై భారతీయ పెట్టుబడిదారుల ఆసక్తి



భారతదేశంలో పెట్టుబడిదారుల ఆలోచనా విధానలు మారుతున్నాయి. ముఖ్యంగా స్థిర ఆదాయాన్ని చిన్న మొత్తాల పొదుపు పథకాల్లో మాత్రమే కాకుండా ఇటీవల కాలంలో స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడి పెడుతున్నారు. అయితే కొంత మంది మాత్రం యూఎస్ స్టాక్ మార్కెట్ వైపు ఆసక్తి చూపుతున్నారు. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన కంపెనీల్లో పెట్టుబడికి ముందుకు వస్తున్నారు. యుఎస్ స్టాక్ మార్కెట్ ప్రపంచంలోని అత్యంత ప్రసిద్ధ కంపెనీలలో కొన్నింటికి ఆతిథ్యం ఇస్తుంది. ఆపిల్, గూగుల్, ఫేస్‌బుక్, జనరల్ మోటార్స్ వంటి కంపెనీలు యూఎస్ స్టాక్ మార్కెట్‌లో ఉంటాయి. ఈ ప్రపంచ దిగ్గజాలలో పెట్టుబడి పెట్టడం వలన మీరు మీ పోర్ట్‌ఫోలియోను వైవిధ్యపరచవచ్చు మరియు భారత స్టాక్ మార్కెట్ దాటి వారి వృద్ధి ప్రయాణంలో పాల్గొనవచ్చు. భారతదేశంలో అమెరికా స్టాక్ బ్రోకర్లు లేనందున అమెరికా ఈక్విటీలలో పెట్టుబడిదారులు పాల్గొనడానికి సహాయపడటానికి అనేక భారతీయ వేదికలు ఉన్నాయి. భారతీయ పెట్టుబడిదారులు యూఎస్ స్టాక్ మార్కెట్లో పెట్టుబడి పెట్టడానికి రెండు ప్రాథమిక మార్గాలను అన్వేషించవచ్చు. ప్రత్యక్ష పెట్టుబడి అంటే యూఎస్ కంపెనీల షేర్లను నేరుగా కొనుగోలు చేయవచ్చు. పరోక్ష పెట్టుబడి అంటే మ్యూచువల్ ఫండ్స్ లేదా ఎక్స్ఛేంజ్-ట్రేడెడ్ ఫండ్స్ (ఈటీఎఫ్‌లు) ద్వారా ఎక్స్‌పోజర్ పొందవచ్చు. చాలా మంది భారతీయ బ్రోకర్లు యూఎస్ బ్రోకర్లతో భాగస్వామ్యాలను కలిగి ఉన్నారు. దీని వల్ల మీరు విదేశీ ట్రేడింగ్ ఖాతా ద్వారా యూఎస్ స్టాక్‌లలో పెట్టుబడి పెట్టవచ్చు. ఖాతాను తెరవడానికి మీరు డాక్యుమెంటేషన్‌ను అందించాల్సి ఉంటుంది. కానీ పెట్టుబడి ఉత్పత్తులపై పరిమితులు లేదా ట్రేడింగ్ ఫ్రీక్వెన్సీ వంటి కొన్ని పరిమితులు వర్తించవచ్చని గమనించడం ముఖ్యం. అదనంగా ఇందులో ఉన్న ఛార్జీల గురించి తెలుసుకోవాల్సి ఉంటుంది. బ్రోకరేజ్ ఫీజులు మరియు కరెన్సీ మార్పిడి ఖర్చులు గణనీయంగా ఉంటాయి.

## స్పోర్ట్స్

## రెండు రోజుల్లో బీసీసీఐ కీలక సమావేశం..

# ఐపీఎల్ ట్రోఫీ సంబురాలపై ఆంక్షలు!





యావత్ భారత క్రీడాలోకాన్ని దిగ్భ్రాంతికి గురి చేసిన చిన్నస్వామి తొక్కిసలాట పలు కుటుంబాల్లో విషాదాన్ని నింపింది. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు విక్టరీ పరేడ్‌లో పాల్గొనేందుకు చిన్నస్వామి స్టేడియానికి వచ్చిన అభిమానుల్లో 11 మంది ప్రాణాలు కోల్పోవడం అందర్నీ కలచి వేసింది. మరోసారి ఇలాంటి ఘటనలు జరగకుండా భారత క్రికెట్ నియంత్రణ మండలి కీలక నిర్ణయం తీసుకోవాలనుకుంటోంది. ఐపీఎల్ ట్రోఫీ గెలుపొందిన తర్వాత జరిపే విజయోత్సవాలపై మార్గదర్శకాలు జారీ చేయనుందనే వార్తల వినిపిస్తున్నాయి. చిన్నస్వామి తొక్కిసలాపై విచారం వ్యక్తం చేసిన బీసీసీఐ సెక్రటరీ సైకియా ప్రణాళికా లోపమే ఘటనకు కారణమని వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే. భద్రతా ఏర్పాట్లు తీసుకొని ఉంటే తొక్కిసలాట జరిగి ఉండేది కాదని ఆయన అభిప్రాయపడ్డాడు. ఈ నేపథ్యంలోనే బీసీసీఐ జూన్ 14 శనివారంనాడు కీలక సమావేశం నిర్వహించనుంది. రాజీవ్ శుక్లా పూర్తి స్థాయి అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టాక జరుగుతున్న తొలి సమావేశం ఇది. ఈ మీటింగ్‌లో దేశవాళీ క్రికెట్ కొత్త సీజన్, వచ్చేఏడాది న్యూజిలాండ్‌తో వన్డే, టీ20 సిరీస్ గురించి చర్చించనున్నారు సభ్యులు. వీటితో పాటు ఐపీఎల్ ట్రోఫీ సంబురాలపై కూడా నిర్ణయం తీసుకుంటారని సమాచారం. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసుకుంటామని మాట ఇస్తేనే విక్టరీ పరేడ్‌లకు అనుమతివ్వాలని బీసీసీఐ భావిస్తోందట. అంతేకాదు భద్రతా ఏర్పాట్లు సంతృప్తిగా అనిపిస్తేనే విక్టరీ పరేడ్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చే అంశాన్ని బోర్డు పరిశీలించే అవకాశముందట.

**నిర్లక్ష్యంతోనే తొక్కసలాట..**

'ఐపీఎల్ 18వ సీజన్‌లో ఆర్సీబీ విజేతగా నిలవడంతో కర్నాటక ప్రభుత్వం విక్టరీ పరేడ్‌ను నిర్వహించింది. జూన్ 3న చిన్నస్వామి స్టేడియంలో సీఎం సిద్ధరామయ్య, ఉపముఖ్య మంత్రి డీకే శివకుమార్‌లు బెంగళూరు ఆటగాళ్లను సన్మానించారు. ఈ కార్యక్రమాన్ని చూసేందుకు స్టేడియానికి అభిమానులు భారీగా పోటెత్తారు. అసంఖ్యాకంగా వచ్చిన ఫ్యాన్స్‌ను అదుపు చేయడంలో పోలీసులు విఫలం అయ్యారు. 35 వేల మంది సామర్థ్యమే ఉన్న స్టేడియంలోకి అభిమానులను పంపడంలో నిర్వాహకులు స్పష్టమైన ప్రణాళికతో లేరు. గేట్ నంబర్ 2, 2ఏ, 6, 7, 15, 17, 18, 20, 21 నంబర్ గేట్ల వద్ద తొక్కిసలాట జరిగింది. ఈ ఘటనలో 11 మంది ప్రాణాలు కోల్పోగా.. 56 మంది తీవ్రంగా గాయపడ్డారు. ఆర్సీబీ ఫ్రాంచైజీ సోషల్ మీడియాలో అందరికి ప్రవేశం ఉచితం అని పోస్ట్ పెట్టడంతోనే అభిమానులు భారీగా స్టేడియానికి వచ్చారు. అందువల్లే తొక్కిసలాట జరిగింది' అని పోలీసులు ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు. తొక్కసలాటలో మరణించిన వాళ్ల కుటుంబాలకు ఆర్సీబీ యాజమాన్యం రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించింది. కర్నాటక ప్రభుత్వం, ప్రధాని నరేంద్ర మోడీ సైతం బాధిత కుటుంబాలకు నష్టపరిహారం చెల్లిస్తామని తెలిపారు.

### ఇంగ్లండ్‌తో తొలి టెస్టు..
### భారత తుది జట్టు ఇదే! జడేజాకు నో ఛాన్స్?




భారత్-ఇంగ్లండ్ మధ్య ఐదు మ్యాచ్‌ల టెస్టు సిరీస్ ఆరంభానికి కేవలం వారం రోజుల సమయం మాత్రమే మిగిలి ఉంది. ఈ సిరీస్‌లో భాగంగా తొలి టెస్టు లీడ్స్ వేదికగా జూన్ 20 నుంచి 24 వరకు జరగనుంది. ఇప్పటికే ఇంగ్లండ్ గడ్డపై అడుగుపెట్టిన భారత జట్టు నెట్స్‌లో తీవ్రంగా శ్రమిస్తోంది. ఈ మ్యాచ్‌లో ఎలాగైనా గెలిచి సిరీస్‌లో శుభారంభం చేయాలని శుబ్‌మన్ గిల్ సారథ్యంలోని టీమిండియా భావిస్తోంది. ఈ క్రమంలో తొలి టెస్టు కోసం టీమిండియా ప్లేయింగ్ ఎలెవన్‌ను భారత మాజీ బ్యాటింగ్ కోచ్ సంజయ్ బంగర్ ఎంచుకున్నాడు. బంగర్ తన ఎంపిక చేసిన తుది జట్టులో ఓపెనర్లగా యశస్వి జైశ్వాల్, కేఎల్ రాహుల్‌కు అవకాశమిచ్చాడు. రోహిత్ శర్మ స్థానంలో ఓపెనర్‌గా రాహుల్ సరైనోడని స్టార్ స్పోర్ట్స్ చర్చాకార్యక్రమంలో బంగర్ అభిప్రాయపడ్డాడు. అదేవిధంగా ఫస్ట్ డౌన్‌లో అన్‌క్యాప్డ్ ప్లేయర్ అభిమన్యు ఈశ్వరన్‌కు అతడు ఛాన్స్ ఇచ్చాడు. ఇక నాలుగో స్థానంలో కెప్టెన్ శుబ్‌మన్ గిల్ బ్యాటింగ్‌కు రావాలని సంజయ్ సూచించాడు. ఇక ఎనిమిదేళ్ల తర్వాత రీఎంట్రీ ఇచ్చిన కరుణ్ నాయర్‌కు ఐదో స్థానంలో ఈ భారత మాజీ క్రికెటర్ చోటు ఇచ్చాడు. ఈ జట్టులో వికెట్ కీపర్‌గా రిషబ్ పంత్, ఆల్‌రౌండర్ కోటాలో నితీష్ కుమార్ రెడ్డిలకు స్థానం దక్కింది. స్పెషలిస్టు స్పిన్నర్‌గా కుల్దీప్ యాదవ్.. ఫాస్ట్ బౌలర్ల కోటాలో జస్ప్రీత్ బుమ్రా, ప్రసిద్ద్ కృష్ణ, సిరాజ్‌ను బంగర్ ఎంపిక చేశాడు. అయితే ఈ మాజీ బ్యాటింగ్ కోచ్ ఎంపిక చేసిన జట్టులో స్టార్ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజాకు చోటు దక్కకపోవడం గమనార్హం. జడేజాతో పాటు యువ సంచలనం సాయిసుదర్శన్‌ను కూడా అతడు పరిగణలోకి తీసుకోలేదు.

ఇంగ్లండ్‌తో తొలి టెస్టుకు బంగర్ ఎంచుకున్న భారత తుది జట్టు

యశస్వి జైశ్వాల్, కేఎల్ రాహుల్, అభిమన్యు ఈశ్వరన్, శుబ్‌మన్ గిల్(కెప్టెన్), కరుణ్ నాయర్, రిషబ్ పంత్, నితీష్ కుమార్ రెడ్డి, కుల్దీప్ యాదవ్,జస్ప్రీత్ బుమ్రా, ప్రసిద్ద్ కృష్ణ, సిరాజ్

### భారత పర్యటనకు న్యూజిలాండ్ క్రికెట్ జట్టు



న్యూజిలాండ్ పురుషుల క్రికెట్ జట్టు వచ్చే ఏడాది జనవరిలో భారత పర్యటనకు రానున్నట్లు తెలుస్తోంది. టీ20 ప్రపంచకప్-2026 సన్నహాకాల్లో భాగంగా ఈ టూర్‌ను కివీస్ క్రికెట్ బోర్డు ప్లాన్ చేసినట్లు పలు రిపోర్ట్‌లు పేర్కొంటున్నాయి. టైమ్స్ ఇండియా రిపోర్ట్ ప్రకారం.. ఈ పర్యటనలో భాగంగా న్యూజిలాండ్ జట్టు ఆతిథ్య టీమిండియాతో మూడు వన్డేలు, ఐదు టీ20లు ఆడనున్నట్లు సమాచారం. ఈ ఏడాది ఆఖరిలో కివీస్ తమ స్వదేశంలో విండీస్‌తో ఆల్‌ఫార్మాట్ సిరీస్ ఆడనుంది. ఈ సిరీస్ ముగిసిన వెంటనే బ్లాక్ క్యాప్స్ జట్టు భారత్‌కు వచ్చే అవకాశముంది. కాగా టీ20 ప్రపంచకప్-2026కు భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యమివ్వనున్నాయి. ఈ టోర్నీ సన్నాహాల్లో భాగంగా సూర్యకుమార్ యాదవ్ నేతృత్వంలోని భారత జట్టు సైతం ఈ ఏడాది ఆఖరిలో దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియాతో టీ20 సిరీస్‌లు ఆడనుంది. న్యూజిలాండ్ చివరగా వైట్‌బాల్ సిరీస్‌లు ఆడేందుకు 2023లో భారత్ పర్యటనకు వచ్చింది. ఆ సమయంలో బ్లాక్ క్యాప్స్ టీమ్ మూడు వన్డేల సిరీస్‌లో వైట్ వాష్ కాగా.. టీ20 సిరీస్‌ను 2-1 తేడాతో భారత్‌కు కోల్పోయింది. ఆ తర్వాత ఏడాది మాత్రం టీమిండియా జరిగిన రెడ్‌బాల్ సిరీస్‌లో మాత్రం న్యూజిలాండ్ ప్రతీకారం తీర్చుకుంది. మూడు టెస్టుల సిరీస్‌లో 3-0 తేడాతో టీమిండియాను కివీస్ చిత్తు చేసింది. అయితే ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ-2025 ఫైనల్లో మాత్రం న్యూజిలాండ్‌ను భారత్ మట్టికరిపించింది.



# తొలిసారి బేబి బంప్‌తో లావణ్య త్రిపాఠి

**క్యూట్ అంటూ కామెంట్స్**

మెగా బ్రదర్ ముద్దుల తనయుడు వరుణ్ తేజ్‌ని వివాహం చేసుకొని మెగా కోడలిగా మారింది లావణ్య త్రిపాఠి. ఈ జంట కొన్నాళ్లు సీక్రెట్‌గా ప్రేమాయణం నడిపి ఆ తర్వాత పెద్దల సమక్షంలో నిశ్చితార్థం చేసుకొని అనంతరం పెళ్లి పీటలెక్కారు. తాజాగా వరుణ్ తేజ్, లావణ్య త్రిపాఠి మాల్దీవులలో ఎంజాయ్ చేస్తున్నారు. ఇలా మాల్దీవులలో ఈ ఇద్దరు తమ వ్యక్తిగత జీవితాన్ని గడుపుతున్నారు. అయితే వారు ఇలా టూర్ కు వెళ్ళినట్లు సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. మాల్దీవుల విహారయాత్ర నుండి ఒక పిక్‌ని లావణ్య త్రిపాఠి షేర్ చేసింది. మాల్దీవ్స్‌కి వెళ్లిన లావణ్య తన ఇన్‌స్టాలో భర్తతో కలిసి దిగిన పిక్ షేర్ చేయగా, ఇందులో లావణ్య బేబి బంప్‌తో కనిపిస్తుంది. ఇది చూసి నెటిజన్స్ క్యూట్ కామెంట్స్ చేస్తున్నారు. వెయిటింగ్ అంటూ ఆ పోస్ట్‌కి కామెంట్స్ పెడుతున్నారు. కాగా, 2023 నవంబర్‌లో ఇటలీలో జరిగిన ఒక విలాసవంతమైన డెస్టినేషన్ వివాహంలో వివాహం చేసుకున్నారు. ఈ జంట తరచుగా విహార యాత్రలకి వెళుతూ అందమైన క్షణాలను పంచుకుంటారు మరియు ఇప్పుడు లావణ్య పంచుకున్న పోస్ట్ మాత్ర వైరల్ అయింది. లావణ్య బేబి బంప్ పిక్ సోషల్ మీడియాని షేక్ చేస్తుంది. లావణ్య కెరీర్ పీక్స్‌లో ఉన్నప్పుడే మెగా హీరో వరుణ్ తేజ్‌ను ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. వివాహం తర్వాత సినిమా రంగానికి దూరమైన లావణ్య, ఇటీవల ఒక సినిమాతో రీఎంట్రీ ఇవ్వనున్నట్లు ప్రకటించారు. అయితే, ఆ తర్వాత తాను గర్భవతి కావడంతో ఆ షూటింగ్ కూడా మధ్యలోనే ఆపేసి, ప్రస్తుతం ఇంట్లోనే ఉంటూ విశ్రాంతి తీసుకుంటున్నారు. అయితే ఇటీవల లావణ్య తన పెంపుడు కుక్క మరణించడంతో తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఎంతో అల్లారు ముద్దుగా పెంచుకుంటున్న తన పెంపుడు కుక్క మృతి చెందిన విషయాన్ని లావణ్య తన ఇన్‌స్టాగ్రామ్ ద్వారా పంచుకుంటూ భావోద్వేగానికి గురయ్యారు. తన పెంపుడు కుక్క మరణం లావణ్యని తీవ్ర భావోద్వేగానికి గురి చేసింది.

# రెండేళ్ల కూతురికి 250 కోట్ల ఆస్తి రాసిచ్చిన స్టార్ హీరో.. బాలీవుడ్‌లో హాట్ టాపిక్





తల్లిదండ్రులు తమ పిల్లల కోసం ఆస్తులు కూడబెట్టడం, వారిని భవిష్యత్తులో స్థిరంగా నిలబెట్టాలని ప్రయత్నించడం మనం చూస్తూనే ఉన్నాం. అయితే కొందరు పిల్లలు పెద్దయ్యాక వారికి ఆస్తులు రాసిచ్చినా, కొన్ని కుటుంబాల్లో మాత్రం ముందుగానే వారసత్వంగా రిజిస్టర్ చేస్తారు. తాజాగా బాలీవుడ్ స్టార్ దంపతులు రణ్‌బీర్ కపూర్, ఆలియా భట్ తమ కుమార్తె రాహా కపూర్ విషయంలో చేసిన పని అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది. 2022 నవంబర్‌లో జన్మించిన రాహా కపూర్ వయసు ఇంకా రెండు సంవత్సరాలే. అయితే ఇప్పటికే ఆమె పేరు మీద భారీ ఆస్తి రిజిస్టర్ చేయబడిందన్న వార్త బాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారింది. ముంబై నగరంలోని ఖరీదైన ప్రాంతమైన బాంద్రాలో వీరికి ఒక ఇల్లు ఉంది. ఆ ఇంటి విలువ ఏకంగా 250 కోట్లు ఉంటుందట.. ఈ ఆస్తి మొదటగా రాజ్ కపూర్ నుంచి రిషి కపూర్, తర్వాత రణబీర్ కపూర్ కి వారసత్వంగా వచ్చింది. గత సంవత్సరంలో ఈ బిల్డింగ్‌ను రణబీర్ పూర్తిగా రీ మోడలింగ్ చేయించినట్టు సమాచారం. ఇది ఆరు అంతస్థుల లగ్జరీ బిల్డింగ్ అని తెలుస్తుండగా, ఇందులో అత్యాధునిక సదుపాయాలతో ని పాటు అన్ని వసతులు ఉండేలా రూపొందించబడింది. రూ. 250 కోట్ల విలువైన లగ్జరీ బిల్డింగ్‌ను రణ్‌బీర్ %-% ఆలియా జంట తమ కుమార్తె రాహా పేరుతో రిజిస్టర్ చేయించారట. దీనికి సంబంధించిన లీగల్ ప్రక్రియలు కూడా పూర్తయ్యాయని సమాచారం. ఇక త్వరలోనే రణ్‌బీర్ ఫ్యామిలీ ఈ ఇంటిలోకి షిఫ్ట్ అవ్వాలని భావిస్తున్నారు. అయితే రెండేళ్ల వయసులోనే 250 కోట్ల ఆస్తికి యజమానిగా మారిన రాహా, బాలీవుడ్ చరిత్రలోనే రికార్డ్ నెలకొల్పిందని అంటున్నారు. ఈ విషయం ఇప్పుడు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది. నెటిజన్లు "ఇదే భవిష్యత్‌కి ముందస్తు ప్లానింగ్" అంటూ కామెంట్లు చేస్తున్నారు. రాహా కపూర్ చిన్నతనంలోనే స్టార్ వారసురాలిగా గుర్తింపు పొందడం సినిమాప్రియులను ఆశ్చర్యానికి గురి చేస్తోంది.

# సౌత్ ఇండస్ట్రీలో స్టార్ స్టేటస్



సౌత్ ఇండస్ట్రీలో టాప్ హీరోయిన్లలో ఆమె ఒకరు. కానీ సినీ ప్రయాణం స్టార్ట్ చేయకముందు యోగా టీచర్. ఎంతో మంది విద్యార్థులకు యోగా నేర్పిస్తూ ప్రశాంతమైన జీవితం గడిపింది. ఆ తర్వాత సినీరంగంలోకి అడుగుపెట్టి స్టార్ హీరోయిన్ గా మారింది. ఆమె నటించిన సినిమాలు ప్రపంచవ్యాప్తంగా రూ.2400 కోట్లకు పైగా వసూళ్లు రాబట్టింది. ఫిట్‌నెస్ నుండి కీర్తికి ఆమె ప్రయాణం సినిమాటిక్ లాగా అనిపిస్తుంది. ఇంతకీ ఆమె ఎవరో తెలుసా..? అనుష్క శెట్టి. వెండితెరపైకి రాకముందు ఆమె భరత్ ఠాకూర్ దగ్గర శిక్షణ పొందిన సర్టిఫైడ్ యోగా టీచర్. దర్శకుడు మెహర్ రమేష్ యోగా సెషన్‌లో ఆమెను చూసి సినిమా ఛాన్స్ ఇచ్చారట. అనుష్కను ముందుగా డైరెక్టర్ మెహర్ రమేష్ పూరి జగన్నాథ్‌కు పరిచయం చేశారు. 2005లో నాగార్జున నటించిన సూపర్ సినిమాతో ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చింది. ఆ తర్వాత మహానంది, అరుంధతి, విక్రమార్కుడు, ధమరుకం, మిర్చి, బిల్లా వంటి చిత్రాల్లో నటించి మెప్పించింది. కానీ ప్రభాస్ సరసన నటించిన బాహుబలి సినిమా ఆమె కెరీర్ మార్చేసింది. ఈ మూవీతో పాన్ ఇండియా లెవల్లో విపరీతమైన క్రేజ్ సొంతం చేసుకుంది.

వీరిద్దరి కాంబోలో వచ్చిన బాహుబలి 1, 2 సినిమాలు వరల్డ్ వైడ్ రూ.2400 కోట్లకు పైగా వసూలు చేశాయి. బాక్సాఫీస్ వద్ద ఈ చిత్రాలు సంచలనం సృష్టించాయి. భిన్నంగా ఉండే పాత్రలను ఎంచుకోవడంలో అనుష్క ముందుంటుంది. బాహుబలి సినిమా తర్వాత సైలెంట్ అయిన అనుష్క.. ఇప్పుడు ఎప్పుడో ఒక సినిమా చేస్తుంది. ప్రస్తుతం ఘాటి చిత్రంలో నటిస్తుంది. ప్రస్తుతం అనుష్క ఆస్తులు రూ.140 కోట్లు.

# కామెడీ ఎంటర్‌టైనర్‌గా 'మిత్ర మండలి' టీజర్




ప్రియదర్శి నిహారిక ఎన్‌ఎమ్ జోడీగా నటిస్తున్న కొత్త చిత్రం 'మిత్ర మండలి'. తాజాగా ఈ మూవీ నుంచి టీజర్‌ను విడుదల చేశారు. ఈ మూవీని విజయేందర్ దర్శకత్వం వహిస్తున్నారు. ఇందులో 'మ్యాడ్' ఫేమ్ విష్ణు ఓయ్, రాగ్ మయూర్, ప్రసాద్ బెహరా ప్రధాన పాత్రలో నటిస్తున్నారు. ఈ చిత్రాన్ని బన్నీ వాసు సమర్పిస్తుండగా కల్యాణ్ మంతిన, భాను ప్రతాప్, విజేందర్ రెడ్డి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. అందర్నీ నవ్వించేలా టీజర్ ఉంది. సోషల్ మీడియా ద్వారా వివిధ భాషల ప్రేక్షకులకు చేరువైన నిహారిక ఎన్‌ఎమ్ .. ఇటీవల 'మిషన్ ఇంపాజిబుల్ – ది ఫైనల్ రెకనింగ్' కోసం టామ్ క్రూజ్‌తో కలిసి పనిచేసి వార్తల్లో నిలిచింది. ఇప్పుడు మిత్రమండలి చిత్రంతో టాలీవుడ్‌లోకి అరంగేట్రం చేస్తోంది. విజయేందర్ ఎస్ నూతన దర్శకుడిగా పరిచయమవుతున్నాడు. బన్నీ వాసు తాను నూతనంగా ప్రారంభించిన బి.వి. వర్క్స్ పతాకంపై 'మిత్ర మండలి' చిత్రాన్ని సమర్పిస్తున్నారు.

Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-5-565, Bhagya Lakshmi Towers, Venkateshwara Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.G.
Owned by Makam Gangadhar and Printed at Ratna Graphics, H.No. 2-3-703/7, Thirumala Nagar Colony, Opp: Amberpet Police Line, Hyderabad - 500 013T.G.
H.No. 11-5-565, Bhagya Lakshmi Towers, Venkateshwara Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.G. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. TGTEL/2025/A0121.